జూలై - 2026

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జప్పత్పనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 05 |
| చస్తే చావను | కె.ఇ. రాజేంద్ర | 07 |
| సాత్వికులు ధన్యులు | హన్నాకృప డెస్క్ | 08 |
| సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 09 |
| కొడవటికంటిగారి... | సాక్ష్యము | 10 |
| తెలివిలేదు, యోచింపరు | హన్నాకృప డెస్క్ | 12 |
| బైబిల్ ప్రాముఖ్యత | హన్నాకృప డెస్క్ | 13 |
| మదర్ తెరీసా | వై. ప్రసాద్‌రావు | 15 |
| తల్లిదండ్రులారా! | కె.ఇ. రాజేంద్ర | 17 |
| తరతరములకు దేవుడు | డా॥ సుష్మ, నెల్లూరు | 19 |
| నా కుటుంబము | స్త్రీల కొరకు | 20 |
| సాతాను వల | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ పదవినోదం-19 | | 24 |



**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,



**చందా వివరాలు :**

**సంవత్సర చందా రూ. 350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-




**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లోపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726


సీరియల్ నంబరు


**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890

సంపాదకీయం....

# మంచి పోరాటము పోరాడు

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

"మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడు కొంటిని" (2తిమోతి 4:7). విశ్వసించడమనేది నిరంతర ప్రక్రియ. మనకి మేలు జరిగినప్పుడు విశ్వాసముంచి, కీడు జరిగినప్పుడు విశ్వాసము నుండి తొలగిపోవడం విశ్వాసము కాదు. మన ఇష్టాలకి వ్యతిరేకంగా జరిగినప్పుడు కూడా దేవునియందు విశ్వాసంతో ఉండటమే విశ్వాస పోరాటం. అపొస్తలుడైన పౌలు మాట్లాడిన మాటలు చూచినట్లయితే, తన విశ్వాసము కాపాడుకొనుటకు మంచి పోరాటము పోరాడినట్లు అర్ధమవుతుంది. 2తిమోతి 6:17లో విశ్వాసమును 'డాలు'తో పోల్చినట్లు చూడగలం. డాలు అనేది యుద్ధానికి వెళ్ళే సైనికులు తమను రక్షించుకోడానికి వాడే ఆయుధం. ఈ లోకంలో మనం జీవించేటప్పుడు ఈ లోకానికి వ్యతిరేకంగా మనం జీవితాన్ని కొనసాగించాలంటే విశ్వాసమనే డాలుతో ఈ లోకాశలకి వ్యతిరేకంగా పోరాటం సాగించాలి. యుద్ధము జరిగేటప్పుడు ఎలా అయితే యుద్ధ నియమాలు పాటిస్తారో, అలాగే ఈ విశ్వాస పోరాటంలో నీతినియమాలు పాటించాలి. ఈ లోకమును జయించే ఆయుధం విశ్వాసమే. *"దేవుని మూలముగా పుట్టిన వారందరును లోకమును జయించుదురు. లోకమును జయించిన విజయము మన విశ్వాసమే" (1యోహాను 5:4).* నిజమైన విశ్వాసంతో జీవించే వాళ్ళకి పోరాటం ఎక్కువగా ఉంటుంది. మనుష్యుల ముందు భక్తి జీవితం నటించేవారికి విశ్వాస పోరాటం ఉండదు. ఈ రోజుల్లో చాలామంది క్రైస్తవులు క్రమం తప్పకుండా చర్చీకి వెళ్తారు, చాలా దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు, సుదీర్ఘ ప్రార్ధనలు చేస్తారు, వాక్యం బోధిస్తారు కాని, దేవునియందు విశ్వాసం మాత్రం ఉండదు. వారి దైనందిన జీవితంలో దేవుని మీద ఆధారపడకుండా అన్యజనులవలే జీవిస్తారు. అంటే, ఇళ్ళు కట్టుకోవడం, డబ్బు దాచుకోవడం, ఆస్తులు కూడబెట్టుకోవడంలాంటివి చేస్తారు. అన్యజనులు వారు నమ్మే దేవుణ్ని విశ్వసించనట్లే క్రైస్తవులు కూడా వారు నమ్మే దేవుని మీద విశ్వాసం ఉంచరు. అలాంటి వారికి విశ్వాసంతో పనిలేదు. మంచి పోరాటం పోరాడాల్సిన అవసరం ఉండదు. క్రైస్తవుల పోరాటం ఈ లోకాశలతోనే అయినప్పుడు ఈ లోకాశలతో జీవించే క్రైస్తవులు అన్యజనులు కాక క్రీస్తును అనుసరించేవారు ఎలా అవుతారు? క్రైస్తవ కుటుంబంలో పుట్టినంత మాత్రాన క్రైస్తవులు కారు. క్రీస్తు బోధల ప్రకారం జీవించేవారే దేవుని దృష్టిలో క్రైస్తవులు అవుతారు. నామకార్ధ క్రైస్తవులు మనుష్యుల దృష్టిలో మాత్రమే విశ్వాసులుగా కనబడతారు తప్ప దేవుని దృష్టిలో వారు అన్యజనులే. ఈ భూమి మీద మన విశ్వాసం పరీక్షింపబడుతుంది. పరీక్షలో విజయం సాధిస్తేనే పరలోకరాజ్యమునకు అర్హత సంపాదించుకొని దేవుని మెప్పు పొందుతాము. *"నశించుపోవు సువర్ణము అగ్నిపరీక్ష వలన శుద్ధపరచబడుచున్నది గదా? దానికంటే అమూల్యమైన మీ విశ్వాసము ఈ శోధనలచేత పరీక్షకు నిలిచినదై, యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు మెప్పును మహిమయు ఘనతయు కలుగుటకు కారణమగును" (1పేతురు 1:7).* ఈ భూమి మీద విశ్వాసులనబడేవారిలో ఎవరైతే దేవుని దృష్టిలో విశ్వాసులుగా ఉంటారో వారికే పోరాటం, వారే తమ విశ్వాసాన్ని కాపాడుకోవాలి. మీరు నిజమైన విశ్వాసులో కాదో మీ పోరాటాన్నిబట్టి నిర్ధారించబడుతుంది. అపొస్తలుడైన పౌలువలె మంచి పోరాటము పోరాడటానికి మీరు సిద్ధమా?

**-కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర, ఎడిటర్**

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

సీరియల్



# జప్నత్పనేహు

**(యోసేపు జీవిత చరిత్ర)**

– కొడవటికంటి

"అట్లు తమ దాసులమైన మేము నెరసిన వెంట్రుకలుగల తమ దాసుడైన మా తండ్రిని మృతుల లోకములోనికి దుఃఖముతో దిగిపోవునట్లు చేయుదుము" అని ఏడ్వటం మొదలుపెట్టాడు యూదా. అంతవరకు మౌనంగా తనలో తాను కుమిలిపోతున్న రూబేను యూదాను గట్టిగా పొదివి పట్టుకొని ఓదార్చసాగాడు. జప్నత్ప తల త్రిప్పలేదు. కాని అంతవరకు బయట ఓపికగా ఉన్న బెన్యామీను ఒక్క ఉదుటున లోపలికి ప్రవేశించి, యూదాని కౌగలించుకొని ఏడ్వటం మొదలుపెట్టాడు. యూదా బెన్యామీనును కౌగిలించుకొని, కొంచెం తేటపడి బెన్యామీనును సముదాయించాడు.

"నీ దాసుడనైన నేను ఈ చిన్నవాని గూర్చి నా తండ్రికి పూటపడి, నీ యొద్దకు నేనతని తీసుకొని రాని యెడల నా తండ్రి దృష్టియందు ఆ నింద ఎల్లప్పుడు ఉండునని చెప్పితిని" అని కొంచెం ఆగి బెన్యామీనుతో కలసి ముందుకు నడచి మోకరించి, జప్నత్పనేహు మాత్రం వినేటట్లు బతిమాలుచూ, "తమ దాసుడనైన నన్ను ఈ చిన్నవానికి ప్రతిగా ఏలిన వారికి దాసునిగా ఉండనిచ్చి ఈ చిన్నవాని..." అంటూ బెన్యామీనును ఇంకొంచెం ముందుకు జప్నత్పకు దగ్గరగా నడిపించాడు. అదే సమయానికి జప్నత్ప ఇటు తిరిగి బెన్యామీనుని చూచాడు. జప్నత్ప ముఖం రెండంతలుగా ఉబ్బి ఉంది. కళ్ళు చింతనిప్పుల్లా ఎర్రగా వాటి నిండా నీళ్ళు, మాట్లాడలేనంత దుఃఖం చూసి అక్షాపు తొందరపడి జప్నత్ప దగ్గరకు వెళ్ళాడు.

"...ఈ చిన్నవాని తన సహోదరులతో వెళ్ళనిమ్ము. ఈ చిన్నవాడు నాతో కూడా ఉంటేనే కాని తండ్రి యొద్దకు నేనెట్లు వెళ్ళగలను" అని క్రింద కూలబడిపోయాడు. తనలో శక్తి అంతా అప్పటికే హరించుకు పోయింది. ఇక ఏమి మాట్లాడలేని స్థితి, అయినా ఓపిక తెచ్చుకొని....

"వెళ్ళిన యెడల నా తండ్రికి వచ్చు అపాయము చూడవలసి వచ్చునని" ముగించాడు.

జప్నత్ప పరిస్థితి గమనించిన అక్షాపు గదిలో ఉన్న సైనికులను చూసాడు. వారందరూ విభ్రాంతి పడిపోయారు. జప్నత్ప ఒక్కసారిగా అక్షాపు వైపు చూస్తూ కుడిచెయ్యి చాపి ద్వారపాలకులను చూపిస్తూ "నా యొద్దనుండి ప్రతి మనుష్యుని వెలుపలికి పంపివేయుడి" అని పెద్దగా అరిచాడు.

రూబేను మొదలు బెన్యామీను వరకు అదిరిపోయి జప్నత్పనేహు వైపు చూచి వెనుకకు వెళ్ళి, దూరంగా గోడకు ఆనుకొని ఊరుకున్నారు.

అక్షాపు పనివారివైపు చూచినప్పుడు, ఒక్కరు కూడా కనిపించలేదు. యోసేపు పెద్దగా ఏడ్వడం మొదలుపెట్టాడు. తను ఎందుకు ఏడుస్తున్నాడో తనకు తెలియదు. ఎంత ప్రయత్నించినా ఏడుపు ఆగటం లేదు. తాను బావిలో పడవేయబడినప్పుడు కూడా ఇంతగా ఏడ్చి ఉండక పోవచ్చు అని అనుకున్నాడు. అక్షాపు లోపలి గదిలోకి తొంగి చూసాడు. అక్కడెక్కడా పనివారు కన్పించలేదు కాని, ఆ మధ్య గదిలో ఆసెనతు కదలిక లేని శిల్పంలా నిలబడి ఉంది. అక్షాపుకు ఏమి మాట్లాడాలనిపించలేదు. జప్నత్పను చూడాలని వెంటనే వెనుదిరిగి వచ్చాడు. జప్నత్ప ఏడుపు పెద్దగా వినిపిస్తుంది.

"నేను యోసేపును" అన్నాడు ఏడుస్తూనే.

"మొదటిసారిగా యోసేపు అన్న మాట వినగానే రూబేను, యూదా ఉలిక్కిపడ్డారు. చుట్టు కలియచూసారు... ఎవరు? యోసేపు ఎవరు?" అన్నట్లుగా చూసారు.

"నా తండ్రి ఇంకా బ్రతికియున్నాడా" అన్నప్పుడు చిన్నతనంలో 'నాతండ్రీ' అని పిలిచే యోసేపు బాణి వినిపించింది. అయినా ఇది కలే, ఎదురుగా ఉన్న ఐగుప్తు ఏలిక, యోసేపు అని ఎలా అంటాడు. గాదు, నఫ్తాలి, ఆషేరు, జెబూలూను అసలు ఏమి వినబడనట్లుగానే, వింటే ఏమి విపత్తు వస్తుందోనన్న భయంతో వారి జ్ఞానేంద్రియాలు పనిచేయటం మానివేశాయి. యూదా రూబేను వైపు, బెన్యామీను వైపు చూస్తున్నాడు. షిమ్యోను మొట్టమొదటిసారిగా

"యో.. సే..పు.." అన్నాడు చిన్నగా. తనను చెరసాల పేరుతో రాజకుమారుని మర్యాదలు కలుగజేసిన కారణం ఇదే! అనుకున్నాడు. ఇప్పుడు యోసేపు ఏడ్వడం లేదు, కాని స్వరం మాత్రం మారిపోయింది. జప్నత్పనేహు స్వరం కాదు. ఇరవై రెండు సంవత్సరాల నుండి ఐగుప్తు భాషలో మాట్లాడిన స్వరం ఇప్పుడు హీబ్రూ భాషలో మాట్లాడుతుంది. "నా దగ్గరకు రండి" అని తన చేతులు చాపాడు. తన తలమీద ఉన్న కిరీటం తీసి అక్షాపు చేతికిచ్చాడు. చూశావా! ఎంత త్వరగా ఈ చిక్కుముడి విడిపోయిందో అన్నట్లుగా ఉంది అతని చూపు. అక్షాపు మందహాసం చేసాడు.

అందరూ ఒకరిని చూసి ఒకరు నిదానంగా ముందుకు నడుస్తూ, ఏడ్చి ఏడ్చి ఎండిపోయిన ఆ ముఖాలను, చింపుకున్న తమ పై వస్త్రాల పేలికలతో తుడుచుకుంటున్నారు.

"ఐగుప్తు వెళ్ళునట్లు మీరు అమ్మివేసిన మీ సహోదరుడై యోసేపును నేనే" అన్నాడు. బెన్యామీను యూదావైపు చూసాడు ఇది నిజమా! అన్నట్లు. యూదా ఔనన్నట్లు తలూపాడు. రూబేను యోసేపుకు దగ్గరగా ఉన్నాడు. అతని కళ్ళ వెంబడి నీరు ప్రవహిస్తుంది.

"అయినను, నేనిక్కడికి వచ్చునట్లు మీరు నన్ను అమ్మివేసినందుకు దుఃఖపడకుడి" అన్నప్పుడు, ఇశ్శాఖారు కొంచెం పెద్దగా ఏడ్చాడు. యోసేపు అతనిని చూస్తూ "అది మీకు సంతాపము పుట్టింపనియ్యకుడి, ప్రాణరక్షణ కొరకు దేవుడు మీకు ముందుగా నన్ను పంపించాడు. కాబట్టి దేవుడేగాని మీరు నన్నిక్కడికి పంపలేదు" అంటూ అక్షాపు చేతిలోని కిరీటం అతని వైపు చూస్తూ, తీసుకుని తల మీద పెట్టుకున్నప్పుడు అక్షాపు ఆజ్ఞానుసారం లేఖికుడు వచ్చి యోసేపు ఎదురుగా కూర్చొని వ్రాయుటకు సిద్ధమయ్యాడు.

"…. ఆయన నన్ను ఫరోకు తండ్రిగాను, అతని ఇంటి వారికందరికీ ప్రభువుగాను, ఐగుప్తు దేశమంతటి మీద ఏలికగాను నియమించెను. మీరు త్వరగా నా తండ్రియొద్దకు వెళ్ళి అతనితో… 'నీ కుమారుడైన యోసేపు, దేవుడు నన్ను ఐగుప్తు దేశమంతటికి ప్రభువుగా నియమించెను, నా యొద్దకు రమ్ము, అక్కడ ఉండవద్దు, నీవు గోషెను దేశమందు నివసించెదవు. అప్పుడు నీవును, నీ పిల్లలును, నీ పిల్లల పిల్లలును, నీ గొఱ్ఱెల మందలును, నీ పశువులును నీకు కలిగినది యావత్తును నాకు సమీపముగా నుండును. ఇంకను ఐదు కరవు సంవత్సరాలు వచ్చును. గనుక నీకును, నీ యింటి వారికిని, నీకు కలిగినదంతటికిని పేదరికం రాకుండా అక్కడ నిన్ను పోషించెదనన్నాడని చెప్పండి" అన్నాడు. తర్వాత లేఖికుడు లేచి వెళ్ళిపోయాడు. ఇప్పుడు అతని సోదరులు అతనికి చాలా దగ్గరగా ఉన్నారు. "ఇదిగో మీతో మాట్లాడుచున్నది నా నోరే" అని, "మీ కన్నులు నా తమ్ముడైన బెన్యామీను కన్నులను చూచుచున్నవి" అన్నాడు యోసేపు.

"ఐగుప్తులో నాకు కలిగిన సమస్త ఘనతను, మీరు చూచిన యావత్తు, నా తండ్రికి తెలియజేసి త్వరగా నా తండ్రిని ఇక్కడికి తీసుకొని రండి" అని చెప్పి, బెన్యామీనును దగ్గరకి తీసుకొని గట్టిగా కౌగిలించుకొని అతని మీదపడి ఏడ్చాడు. ఈ దృశ్యానికి తన కళ్ళ వెంట నీరు కారుతుంటే చూస్తూ నిల్చుండిపోయాడు అక్షాపు.

**(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపించాలంటే క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

45

# నా చిత్తానుసారుడు

(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

మోకరించి "నా ప్రభువా యెహోవా", అని ఆగి పోయాడు. నోరు పెగలలేదు. తన జీవితంలో ప్రభుని సన్నిధి ఇంత చేరువగా ఎన్నడు అనుభవించలేదు.

"ఇంతగా నీవు నన్ను హెచ్చించుటకు నేనెంతటి వాడను? నా కుటుంబం ఏపాటిది?" అని ఆగి ఆలోచించాడు. ఔను ఇది నాకు హెచ్చుకాని దేవునికి హెచ్చుకాదుగా.

"ఇంత హెచ్చుగా చేసినదంతయు నీ దృష్టికి కొంచెమై మానవుల పద్ధతినిబట్టి బహుకాలము జరిగిన తర్వాత నీ దాసుడనైన నా సంతానమునకు కలుగబోవు దానిని గూర్చి నీవు సెలవిచ్చి యున్నావు..." ఇక ప్రార్ధన గాఢంగా సాగుతుంది.

"యెహోవా నా ప్రభువా దావీదు అను నేను ఇక నీతో ఏమి చెప్పుకొందును? యెహోవా నా ప్రభువా? నీ దాసుడనైన నన్ను నీవు ఎరిగియున్నావు. నీ వాక్కునుబట్టి నీ ఇష్టానుసారముగా ఈ ఘనకార్యములను జరిగించి నీ దాసుడనగు నాకు దీని తెలిపియుంటివి. కాబట్టి దేవా! యెహోవా, నీవే అత్యధికమైన ఘనత గలవాడవు. నీవంటి దేవుడొకడును లేడు. మేము వినిన దానినంతటినిబట్టి చూడగా నీవు తప్ప దేవుడెవడును లేడు. నీకు ఖ్యాతి కలుగునట్లును నీ జనులను బట్టి నీ దేశమునకు భీకరమైన మహా కార్యములు చేయునట్లును దేవుడవైన నీవు ఐగుప్తు దేశములో నుండియు ఆ జనుల వశములో నుండియు వారి దేవతల వశములో నుండియు నీవు విమోచించిన ఇశ్రాయేలీయులనుబట్టి నీ జనమువంటి జనము లోకమునందు మరి ఎక్కడనున్నది. మరియు యెహోవావైన నీవు వారికి దేవుడవైయుండి వారు నిత్యము నీకు ఇశ్రాయేలీయులను పేరుగల జనులై యుండునట్లుగా వారికి నిర్ధారణ చేసితివి. దేవా యెహోవా, నీ దాసుడనగు నన్ను గూర్చియు నీవు సెలవిచ్చిన మాట యెన్నటికి నిలుచునట్లు దృఢపరచి సైన్యములకధిపతియగు యెహోవా ఇశ్రాయేలీయులకు దేవుడైయున్నాడను మాట చేత నీ నామమునకు శాశ్విత మహిమ కలుగునట్లును నీవు సెలవిచ్చిన మాట నెరవేర్చుము. ఇశ్రాయేలీయుల దేవా సైన్యములకధిపతియగు యెహోవా, నీకు సంతానము కలుగజేయుదునని నీవు నీ దాసుడనైన నాకు తెలియపరచితివి గనుక ఈలాగున నీతో మనవి చేయుటకై నీ దాసుడనైన నాకు ధైర్యము కలిగెను. యెహోవా నా ప్రభువా, మేలు చేయుదునని నీ దాసుడనైన నాకు సెలవిచ్చు చున్నావే నీవు దేవుడవు గనుక నీ మాట సత్యము. నీ సన్నిధిని ఉండునట్లుగా దానిని ఆశీర్వదించుము. యెహోవా నా ప్రభువా, నీవు సెలవిచ్చి యున్నావు. నీ ఆశీర్వాదము నొంది నా కుటుంబము నిత్యము ఆశీర్వదింపబడునుగాక".

గదిలో నుండి బయటకు వచ్చిన దావీదు ముఖం వెలుగుతుండటం అబీగయీలు చూసింది. ప్రభువు సన్నిధిలో ఆయన ప్రార్ధన చేసుకొని రావడం అలవాటే కాని ఇప్పుడు ఆయన ముఖం వింతగా మెరుస్తుంది అనుకుంది. దావీదు మౌనంగా తన గదిలోనికి వెళ్ళటం చూసి తాను ఆగి పోయింది. ఏదో జరిగింది. అది మాములు విషయం కాదు అని అనుకుంది. అరగంట తర్వాత పిలువు అని చెప్పి గబగబ గదిలోనికి వెళ్ళి దావీదు ప్రక్కనే కూర్చుంది.

"దానియేలు ఎక్కడ" అడిగాడు దావీదు.

"అబ్షాలోముతో కలసి వెళ్ళాడు" అని అంది.

"దేవుని మందిరము కట్టిద్దామని అనుకున్నాను కదా!" అన్నాడు.

"ఔను రాత్రంతా అదేగా మీరు ఆలోచిస్తుంది" అంది.

"కాని ఇప్పుడు ఆ విషయం మర్చిపోవాలి. ఉదయం ప్రవక్త వచ్చింది ఈ సంగతి చెప్పటానికే" అన్నాడు దావీదు.

"మరి ఎవరు కట్టిస్తారు?" అంది.

"ప్రభువు నాకు సంతానం ఇస్తానన్నాడు. ఇకను పుట్టబోయే కుమారులలో ఎవరో ఒకరు" అన్నాడు.

"ఎవరి కుమారుడో" అంది తనలో తాననుకున్నట్లు.

"ప్రభువు నన్ను తనకు ఆలయము కట్టవద్దన్నాడు కాని ఆలయము పని చెయ్యవద్దనలేదు కదా!" అన్నాడు.

అబీగయీలు ఇంకా ఆలోచనలో నుండి బయటకు రాలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అడిగాడు.

"అదే ఎవరి కుమారుడు? అంటే ఎవరికి పుట్టే కుమారునితో దేవుడు తన ఆలయము కట్టించుకుంటాడు" అంది.

దావీదు నవ్వుతూ "అదా ఆలోచిస్తున్నావు, ఎవరికైతేనేమి ఇప్పుడున్న భార్యలలో ఎవరో ఒకరి కుమారుడు" అన్నాడు దావీదు.

అబీగయీలు దగ్గరగా జరిగి "అంటే ఇంక భార్యల సంఖ్య పూర్తయినట్లేనన్న మాట" అంది నవ్వుతూ..

"అవును ఇప్పటికే వున్న సంఖ్య ఎక్కువ అనుకుంటున్నాను. సంఖ్య ఎక్కువయ్యే కొలది దేవుని ధ్యానమునకు సమయం తగ్గిపోతుంది. ఇంక చాలు అన్నాడు. దేవుడు నెమ్మది, ఐశ్వర్యం ఇచ్చాడు. ఇక కాలమంతా ఆయన ఆలయమునకు అవసరమైన బంగారం, ఇత్తడి, వెండి, ఇనుము, దేవదారు మ్రానులు, కంచు పని ఇందుకే ఉపయోగించాలి" అన్నాడు.

అబీగయీలు బ్రతిమాలుతున్నట్లుగా దావీదు చేతులు రెండు పట్టుకొని "దానియేలును దేవుని ఆలయ పనులలో మీ వెంట ఉండనివ్వండి. దానియేలు ప్రభుని యాజకుడు కావాలని నా కోరిక" అంది.

దావీదు అబీగయీలును ప్రేమగా దగ్గరకి తీసుకున్నాడు.

"అబీ, దానియేలు అన్ని విషయాల్లో నీ గుణగణాలు సంతరించుకున్నాడు. అతని విషయంలో నాకెలాంటి విచారం లేదు. అతను పుట్టుకతోనే యాజకుడు ప్రభువును అతడు విడిచినా ప్రభువు అతనిని వదలడు" అన్నాడు.

అబీగయీలు తృప్తిగా తలవంచింది.

అబీషై రాగానే "అబీషై మనం ఏన్గెదీలో ఉన్నప్పుడు సౌలును చంపకుండా వదలినప్పుడు, సౌలు, నిశ్చయముగా నువ్వు రాజువగుదువు. ఇశ్రాయేలీయుల రాజ్యము నీకు స్థిరపరచబడుననియు నాకు తెలియును. కాబట్టి నా తరువాత నా సంతతి వారిని నీవు నిర్మూలము చేయకుండునట్లు నా తండ్రి ఇంటిలో నుండి నా పేరు నీవు కొట్టివేయకుండునట్లును యెహోవా నామమున నాకు ప్రమాణము చేయుమని అడిగి ప్రమాణం చేయించుకున్నాడు గదా! అంతేకాక యోనాతానునుబట్టి నేను ఉపకారము చేయుటకు సౌలు కుటుంబంలో ఎవరైనా కలడేమో విచారించుము" అన్నాడు.

అబీషై వెళ్ళి సౌలు కుటుంబ సేవకుడైన సీబాని పిలుచుకొని దావీదు యొద్దకు వచ్చాడు.

"సీబా నీవే గదా!" అన్నాడు దావీదు.

"నీ దాసుడనైన నేనే" అని సాష్టాంగ నమస్కారం చేశాడు.

"యెహోవా నాకు దయచూపినట్లుగా నేను ఉపకారము చేయుటకు సౌలు కుటుంబంలో ఎవడైనను యొకడు శేషించియున్నాడా?" అని అడిగాడు.

సీబా మరొకసారి వంగి నమస్కారం చేసి, "మెఫీబోషెతు. రాజా, గిల్బోవ యుద్ధ సమయంలో అయిదేండ్లవాడు. అతని దాది అతనిని ఎత్తుకొని పారిపోవుచుండగా క్రింద పడినప్పుడు కుంటివాడై, ఇప్పుడు గిలాదులోని లోదెబారులోనున్న అమ్మీయేలు కుమారుడుగు మాకీరు ఇంటివద్ద ఉన్నాడు" అని చెప్పాడు.

"వెంటనే అతనిని తీసుకొని రమ్ము" అన్నాడు దావీదు.

నాలుగు రోజుల తర్వాత మెఫీబోషెతు దావీదు ఎదుటికి వచ్చి సాష్టాంగ నమస్కారం చేసాడు.

"మెఫీబోషెతూ" అని పిలిచాడు దావీదు.


మెఫీబోషెతు లేచాడు. మోఫీబోషెతు కాళ్ళు చక్కగా నిలుచుండలేనంతగా వంకరగా వున్నవి.

"చిత్తము, నీ దాసుడనైన నేనున్నాను" అన్నాడు మెఫీబోషెతు.

"నీవు భయపడవద్దు. నీ తండ్రియైన యోనాతాను నిమిత్తం నిజముగా నేను నీకు ఉపకారం చూపి, నీ పితరుడైన సౌలు భూమి అంతయు నీకు మరల ఇప్పింతును మరియు నీవు సదాకాలం నా బల్ల యొద్దనే భోజనం చేయుదువు" అన్నాడు దావీదు. **(సశేషం)**



# 'చస్తే చావను'



అలిగిన వాళ్ళని అన్నం తినమంటే 'చచ్చినా తినను' అంటారు, ఇష్టంలేని పని చెయ్యాల్సొస్తే 'చచ్చినా చెయ్యను' అంటారు కానీ, నేను 'చచ్చినా చావను' అని ఎవరైనా అంటారా? ఎవ్వరూ అనరు, అనలేరు కూడా. ఎందుకంటే చావు గురించి ఎవరూ ఆలోచించరు. అందరికి చావంటే చచ్చేంత భయం. రోజూ ఎంతోమంది చనిపోతూనే ఉంటారు. న్యూస్‌పేపర్‌లో కానీ, ఛానల్స్‌లో కానీ చావువార్తలు లేని రోజు ఒక్కటి కూడా ఉండదు. తెల్లవారి నిద్రలేచి బయటకు వస్తే కొన్ని చావు ఫ్లెక్సీలు దర్శమిస్తుంటాయి 'ఇక సెలవు', 'ప్రభువునందు నిద్రించెను' 'శ్రద్ధాంజలి' ఇలా రకరకాల పేర్లతో కనిపిస్తాయి. వాళ్ళలో మనకు బాగా తెలిసినవాళ్ళు చనిపోతే చాలా బాధపడతాము. 'అయ్యో, నిన్ననే కలిసి మాట్లాడానే, సరదాగా జోకులు వేసుకున్నాం, ఇంతలోనే' అని ఆశ్చర్యపోతాం. ఒక్కరోజు తేడాలో మనుష్యులు మాయమై పోతున్నారు. అయినా మనకు కనీసం చీమ కుట్టినట్లయినా ఉండదు. నిన్న కలిసి మాట్లాడిన వ్యక్తి తెల్లారేసరికే కనబడ కుండా పోయాడే అనుకుంటారే తప్ప, ఆ చనిపోయిన వ్యక్తి స్థానంలో నేను ఉంటే? అని అనుకోరు. 'నేను చావను' అన్న ధీమా ఎక్కడి నుండి వస్తుంది? యాక్సిడెంట్స్‌లో, హార్ట్ ఎటాక్‌తో అనుకోకుండా చనిపోయిన వాళ్ళని చూచినప్పుడు మనకు గ్యారంటీగా అలా జరగదు అనుకోడానికి, మనల్ని మనం అతీతులుగా చేసుకోడానికి కారణాలు ఏంటో ఒక పేపర్ మీద రాసి పెట్టుకోండి. చనిపోయిన వాళ్ళు పాపులు, మనం పవిత్రులం కాబట్టి మనం అలా చావలేదని అను కుంటే అది అవివేకమే. 'సిలోయములోని గోపురము పడి చచ్చిన ఆ పదునెనిమిది మంది, యెరూషలేములో కాపుర మున్న వారందరింకంటే అపరాధులని తలంచుచున్నారా?.. మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు' (లూకా 13:4) మారడానికి దేవుడు మనకిచ్చిన సమయాన్ని దుర్వినియోగం చేయడమే గాక, మనల్ని మనం నీతిమంతులుగా భావించుకుంటున్నాం. దేవుని రక్షణ కవచం లేకుండా మనకి మనం నీతిమంతులనుకుంటే ప్రయోజనం లేదు. బయటకు వెళ్ళిన వాళ్ళు ఇంటికి తిరిగి వస్తారన్న గ్యారంటీ ఏమీ లేదు. మనం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న ప్పటికీ ప్రమాదం ఏ వైపునుండి అయినా రావచ్చు. మన గుండె ఏ క్షణాన్నైనా ఆగిపోవచ్చు. మనం దేనిని ఆపలేము. మారుమనస్సు పొందకుండా మన ప్రాణాలను మనమే కాపా డుకొనే అవకాశమే లేదు. దేవుడు మనకి అనుగ్రహించిన ఆయుష్కాలం పూర్తి చేసుకోవాలంటే దేవుని సంరక్షణలోకి వెళ్ళాలి. లేదంటే ప్రమాదాల ద్వారా మరణం మన దగ్గరకు వచ్చినప్పుడు మనం దాని నుండి తప్పింపబడం. ఎందుకంటే 'మరణము తప్పించుట ప్రభువైన యెహోవా వశము' (కీర్త నలు 68:20). దేవుడు యోబుని సాతానుకు అప్పగించిన ప్పుడు సాతానుతో 'అతని ప్రాణము మాత్రం నీవు ముట్ట వద్దని' చెప్పటం గమనించగలం. అంటే మన ప్రాణాలకు ఖచ్చితమైన గ్యారంటీ ఇవ్వగలింది దేవుడు మాత్రమే. అయితే అది దేవుని బిడ్డలకు మాత్రమే తప్ప ఈ లోకానుసారమైన జీవితం జీవించే వాళ్ళకి మాత్రం కాదు. ఇంత అని దేవుడు మనకు ఆయుష్కాలము ఇచ్చింది మనం ఆయన కోసం జీవించడానికే తప్ప మనిష్టానుసారంగా జీవించడానికి మాత్రము కాదు. మారుమనస్సు పొందకుండా, దేవునికి అవిధేయతగా జీవిస్తూ నేను 'చస్తే చావను' అనుకునే వారి ప్రాణాలు గాలిలో దీపంలాంటివే. ఎప్పుడు ఆరిపోతాయో ఎవరూ చెప్పలేరు.

ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు
**9 4 4 0 2 1 7 7 2 6**

# సృష్టికర్త

దేవుడు నాలుగవ దినమున ఆకాశమందు జ్యోతులను (సూర్యచంద్ర నక్షత్రములను) చేసెను. రాత్రిని ఏలుటకు దేవుడు ఆకాశ విశాలమందుంచిన చిన్నజ్యోతిని మనం చంద్రుడని పిలుచుకుంటున్నాం. దేవుని సృష్టిలో భాగమైన చంద్రుని గురించి కొన్ని ఆసక్తికరమైన సంగతులను తెలుసుకుందాం.

చందమామ భూమి యొక్క సహజ ఉపగ్రహం. అంటే భూమి చుట్టూ తిరిగే ఒక గ్రహం. అంతరిక్షంలో నిరంతరం జరిగే ఉల్కాపాతంలో అనేక ఉల్కలు చంద్రుని ఢీ కొట్టడంతో చంద్రునిపై అనేక గుంటలు, లోయలు ఏర్పడ్డాయి. అవే భూమి మీదున్న మనకు మచ్చలులా కనబడతాయి.

చంద్రుడు భూమి చుట్టూ తిరగడానికి సుమారు 28 రోజలు పడుతుంది. అంటే చంద్రుని మీద ఒక్కరోజు సమయం భూమి మీద 14రోజుల సమయానికి సమానం.

మన విశ్వాన్ని నిరంతరం పరిశోధిస్తున్న శాస్త్రవేత్తల అంచనా ప్రకారం చంద్రుని వయస్సు 440 నుండి 450 కోట్ల సం॥లు అయి ఉంటుందని అంచనా. భూమికి గురుత్వాకర్షణశక్తి ఉన్నట్లే చంద్రునికి ఆకర్షణ ఉంటుంది. కాకపోతే భూమ్యాకర్షణ శక్తితో పోలిస్తే అది కేవలం 1.2% మాత్రమే. చంద్రునికి ఉన్న ఈ ఆకర్షణశక్తి భూమిమీది వాతావరణంపై ప్రభావం చూపుతుంది. చంద్రుడు తన ఆకర్షణ శక్తితో భూమి మీద సముద్రపు నీటిని ఆకర్షిస్తుంది. ఫలితంగా సముద్రంలో అలలు ఏర్పడతాయి. చంద్రుడు భూమికి దగ్గరగా వచ్చినప్పుడు సముద్రంలో అలలు చంద్రునివైపు ఆకర్షింపబడతాయి. ఫలితంగా చాలా పెద్ద అలలు ఏర్పడ్తాయి. ఈ అలలు కారణంగానే మూడవ వంతు సముద్రపు జీవరాశులకు ఆహారం అందుతుంది.

భూమి మీద ఉష్ణోగ్రతలను నియంత్రిచుటలోను చంద్రుని పాత్ర ఉంటుంది. సముద్రపు అలల వలననే నీటి ఆవిరి ఏర్పడుతుంది. తత్ఫలితంగా గాలిసాంద్రత పెరిగి వాతావరణంలో ఉష్ణోగ్రతలు మారడమే కాక భూభ్రమణానికి కావలసిన ఒత్తిడి కూడా ఏర్పడుతుంది.

విశ్వంలో జరిగే రకరకాల ఉల్కాపాతం నుండి భూమిని రక్షించుట చంద్రుని విధులలో ఒకటి.

భూమి సూర్యుని చుట్టూ తిరిగే కక్ష్య కొంత ఒంపు కలిగి ఉంటుంది. ఆ కక్ష్య ఒంపుగా ఉన్నప్పటికి స్థిరంగా ఉండుటకు చంద్రుని ఆకర్షణ శక్తే కారణం.

చంద్రుడు భూమి నుండి దూరముగా జరుగుతున్నట్లు శాస్త్రవేత్తలు గమనించారు. చంద్రుడు భూమికి దూరంగా జరగడం వలన భూమి మీద సముద్రపు అలలు, అలల తాకిడి వలన ఏర్పడే ప్రభావాలు అన్ని మానవ మనుగడకు అనుకూలంగా ఉన్నాయి.

ఒకవేళ చంద్రుడు భూమికి దగ్గరగా జరిగితే... సముద్రపు అలలు చంద్రాకర్షణకు గురైనప్పుడు తీరప్రాంతాలలో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

అలాగే చంద్రుడు భూమికి దూరంగా జరగడం కూడా ప్రమాదకరమే. ఎందుకంటే చంద్రుడు లేకపోతే భూమి మీద ఉష్ణోగ్రతలు, సముద్రపు అలలు వాటి తీవ్రతలలో అసమతుల్యత ఏర్పడుతుంది. ఫలితంగా మంచు పర్వతాలు కరగడం, సముద్రతీరప్రాంతాలలో విపరీత పరిస్థితులు ఏర్పడతాయి.

ప్రస్తుతం చంద్రుడు సంవత్సరానికి భూమి నుండి 3.8 సెంటిమీటర్ల దూరం జరుగుతున్నాడని అంచనా కాబట్టి ఇంకా కొన్ని బిలియన్ సంవత్సరాల వరకు చంద్రుడు మనకు కనిపించే అంత దూరంలోనే ఉంటాడు.

ఇంత సంక్లిష్టమైన విశ్వాన్ని అందులోని గ్రహాలను మానవ మనుగడకు సరిపోయే విధంగా నడిపిస్తున్న దేవదేవునికి కృతజ్ఞత కలిగి జీవిద్దాం.

సాక్ష్యము

# కొడవటికంటిగారి సాక్ష్యము

2000 సం॥ము జనవరి 10వ తేదీన నా కళ్ళు పచ్చగా ఉన్నాయని యింటికి దగ్గర్లో ఉన్న రాంబాబు డాక్టరుగారి దగ్గరకు వెళ్ళాను. రక్తము 2 శాతం మాత్రమే ఉంది అని మందులు వ్రాశారు. పది రోజుల్లో నయమైంది.

ఒకరోజు మధ్యాహ్నం నా స్నేహితుడు గవర్నమెంటు హాస్పిటల్లో కంటి వైద్యుడైన డాక్టరు మురళి వచ్చి, నా కళ్ళు చూచి ఆశ్చర్యపోయాడు. నెల రోజుల నుండి నువ్వు నన్ను చూడటానికి రాలేదు. సంగతి ఏమిటో కనుక్కుందామని వచ్చాను అన్నాడు. వెంటనే ఆయన బండి మీద గవర్నమెంటు హాస్పిటల్‌కి తీసుకెళ్ళి నన్ను చేర్పించాడు. నెల రోజులు అక్కడ ఉన్నాను కాని ఏ మాత్రం నయం కాలేదు. నా తమ్ముడు జోషి ఇంటికి తీసుకొని వచ్చి స్టేషన్ దగ్గర వున్న చలపతి అనే నాటువైద్యుని పిలిపించాడు. ఆయన నెల రోజులు వైద్యం చేశాడు. ప్రతిరోజు గంధం నూరించి ముద్దలు మింగించేవాడు. ఇంకా ఏవో చూర్ణాలు మింగించాడు. కడుపు రోజురోజుకి పెరిగి పెద్దదై ప్యాంటు వేసికోలేక పోయాను.

అక్కడ నుండి నల్లూరి నర్సింగ్ హోమ్‌కి వెళ్ళాను. అప్పటికి నాలుగు నెలలు గడిచిపోయాయి. నర్సింగ్ హోమ్ వారు ఒక నెల మందులు వాడి మద్రాసుకాని హైదరాబాద్ కాని అపోలో హాస్పిటల్‌కి వెళ్ళండి ఇక్కడ నయం కాదు అన్నారు. కాని నేను ఆ ప్రయత్నమే చేయలేదు. అపోలోకి వెళ్ళాలంటే ఎంత తక్కువ అయినా 50 వేలు అవుతుంది. నేను అప్పు చెయ్యను, చందా అడుగలేను. అప్పటికి నాకు 60 సంవత్సరాలు. సగం ప్రపంచం తిరిగాను. స్వదేశంలో ముప్పాతిక భాగం చూశాను. ఆరు నవలలు రాశాను. 9 మంది పిల్లలు వున్నారు. వారందరూ పెద్దవాళ్ళయి ఎవరి కాళ్ళ మీద వాళ్లు బ్రతుకుతున్నారు. ఇంక నేను చనిపోయినా అంతగా బాధపడే వాళ్ళు ఎవరూ లేరు. అప్పు చేసి చచ్చిపోతే ఎంత అసహ్యం?

నాకు మొదటిసారి జాండిస్ వచ్చినప్పుడు జనవరిలో పరీక్ష చేసిన రాంబాబు దగ్గరికి సాయంకాలం 6 గంటలకు వెళ్ళాను. ఆయన మూత్రంపట్టి తెమ్మన్నాడు. చీకటి పడుతుంది. నేను మూత్రంపట్టి డాక్టరు దగ్గరు తీసుకెళ్తున్నాను. డాక్టరు దూరం నుండి ఆ మూత్రం రంగు చూసి అక్కడే పెట్టు అని, నా కుమారుని లోపలికి తీసుకెళ్లి వెళ్లి మీ నాన్న రెండు రోజులకంటే ఎక్కువ బ్రతకడు, ఇంక పరీక్షలు అవసరం లేదు అని పంపించాడు. 13 సంవత్సరాలు క్రితం ఆ డాక్టరు మా నాయనను పరీక్షించి గుండె పెద్దదయింది. ఇంక రెండు నెలల కంటే ఎక్కువ బ్రతకడు అని చెప్పాడు. అలానే మా నాయన చనిపోయాడు. ఇప్పుడు నేను రెండు రోజులకంటే ఎక్కువ బ్రతకనని చెప్పాడు.

ఇంటికి వచ్చిన తర్వాత ఆ సంగతి అందరికి తెలిసి పోయింది. నేను రెండు రోజులే బ్రతుకుతానని. వెంటనే నా కుమారుడు డబ్బు తేవడానికి బెంగుళూరు వెళ్ళాడు. చనిపోయే ముందు నన్ను చూడటానికి దూర ప్రాంతాల నుండి బంధువులు స్నేహితులు రావటం ప్రారంభించారు. నేను ఏ మాత్రం ఆలోచించటం లేదు. భయపడలేదు, దిగులుపడలేదు.

మా యింటి ప్రక్క నాలుగంతస్తుల ఇల్లు మా తమ్ముడు జోసఫ్‌ది. ఆ ఇంట్లో ఎప్పుడూ ఎవరో ఒకరు ఇద్దరు, పదిమంది, పాతిక మందైనా తెల్లవాళ్లు వుంటారు. వారిలో ఇద్దరు ఆడవాళ్లు ఉన్నారు. వారిలో ఒకామెకు స్వస్థతవరం వుందంట. కాని ఆమెను ప్రార్థన చెయ్యమని అడుగలేదు. పైగా యేసుప్రభువుకు రికమండేషనా అనుకునే వాడ్ని. ఆయన చిత్తమైతే బ్రతుకుతాను లేకుంటే లేదనుకునేవాడిని. ఆ ఉదయం ప్రక్కింట్లో వున్న అమెరికా ఆమె జానెట్ 'నేను వచ్చి ప్రార్థన చేసేదా?' అని కబురు చేసింది. సంతోషంగా రండి అని కబురు చేశాను కాని ఆమె రాలేదు.

మరునాడు సాయంకాలం మిద్దెమీద పిట్ట గోడకి మంచం ఆనిచ్చి కూర్చుని క్రిందకు చూస్తున్నాను. ఎదురుగా మా చర్చి తలుపులు మూసి వున్నాయి. చీకటి పడుతుంది. పిట్టగోడమీద తొట్లలో పూలచెట్లు వున్నాయి. నేను చర్చిని చూస్తున్నాను. నాకు పెద్ద కడుపు, పెద్ద లివర్. అంతలో భళ్ళున చర్చి తలుపులు తెరచుకొని జానెట్ బయటికి వచ్చింది. ఆమె వెంట నలుగురు ఆడవాళ్ళు వున్నారు. ఆమె వాళ్ళతో ఏదో మాట్లాడుతున్నది. నిన్న ఈమె వస్తానని చెప్పింది ఎందుకు రాలేదో అనుకున్నాను. ఇంతలో ఒక చిన్న పిల్లవాడు వచ్చి 'తెల్ల దొరసాని నీకు ప్రార్థన చెయ్యటానికి వస్తుంది' అన్నాడు. 'సరే రమ్మను' అని చెప్పి, నేను చర్చి వరండాలో నిలబడి వున్న జానెట్‌ని ఆ పల్లెటూరు ఆడవాళ్లని చూస్తూ ఉన్నాను.

అంతే నేను లేచి ఒక ఇంట్లోకి ప్రవేశించాను. లోపల పెద్ద హాలు. మధ్య తరగతి కుటుంబీకుల ఇల్లు. బీదవారు కాదు గొప్పవారు కాదు. కుడిప్రక్కకు చూశాను. అక్కడ యేసు ప్రభువు వున్నాడు. నేను ఇంటి లోపలికి వచ్చి కుడిప్రక్కకు చూసినప్పుడు యేసుప్రభువు యూదులు భోజనం చేసే పద్ధతిలో కూర్చుని వున్నాడు. ఎడమ చేతిమీద ఆనుకుని ఎడమవైపుకి పండుకున్నట్లుగా గోడకు కాళ్లు చాపి కుడిచేత్తో రొట్టె తింటున్నాడు. రొమ్మున ఆనుకొనిన శిష్యుడు, అనగా యేసుప్రభువు భోజనానికి పైవిధంగా కూర్చున్నప్పుడు యేసుప్రభువుతో మాట్లాడాలంటే యేసుప్రభువు రొమ్ముకు తన వీపు తగిలేటట్లుగా తిరగాలి. పరిసయ్యుని ఇంట్లో ప్రభువు ఈ విధంగానే భోజనమునకు కూర్చునప్పుడు పాపాత్మురాలైన స్త్రీ ఈ విధంగా భోజనానికి కూర్చుని వున్న యేసు పాదమును కన్నీటితో కడిగింది.

యేసుప్రభువు ఆ విధంగా రొట్టెతింటూ, నేను లోపలికి వచ్చినప్పుడు తలెత్తి నన్ను చూశాడు. 'వచ్చావా?' అన్నట్లుగా చూచి ఆ హాలు మధ్యలో చాప మీద కూర్చుని వున్న ఒక వ్యక్తితో ఏదో సీరియస్‌గా మాట్లాడుతున్నాడు. నేను నా తల త్రిప్పి ఆ వ్యక్తిని చూడలేదు. యేసుప్రభువు మీద నుండి నా కళ్లు త్రిప్పలేదు. కొంచెంసేపు నిలుచున్నాను. కడుపు ఎత్తుగా, కాళ్ళు చేతులు సన్నగా, కడుపు బరువుగా నొప్పి పుట్టింది. అక్కడే చూస్తూ కూర్చున్నాను. అప్పుడు ప్రభువు తలత్రిప్పి నన్ను చూసి మరలా ఆ హాలులో వున్న వ్యక్తితో ఏదో భాషలో మాట్లాడుతున్నాడు. నాకు ఆ భాష అర్థంకాలేదు.

అంతలో నేను లోనికి వచ్చిన దారినే ఒక స్త్రీ నాకు, ప్రభువుకు మధ్యగా వచ్చి మరొక రొట్టె ఆయన ప్లేటులో పెట్టి వెళ్లింది. ఆమె కాళ్లు మాత్రం చూశాను. ఆమె ముఖం చూడలేదు. కాని వెంటనే ఆమె పేతురు అత్త అని, ప్రభువుకు పరిచర్య చేస్తుందని, ప్రభువు మాట్లాడుతుంది పేతురుతో అని, ఇది పేతురుగారి ఇల్లు అని గ్రహించాను.

తర్వాత ప్రభువు పరుపు మీద నా ఎదురుగా ఐదు అడుగుల దూరంలో కూర్చుని నన్ను చూస్తున్నాడు. నేను కూడ ఆయన ముఖాన్ని చూశాను. చిన్న గడ్డం, బలమైన శరీరం, గుండ్రని లేత ముఖం 30 సం॥ల యౌవనస్తుడు. తెల్లని అంగీ కొంచెం ఆకుపచ్చ రంగు. చాలాసేపు ఆయన కళ్ళలోకి చూస్తున్నాను. ఆయన కూడ నన్ను కన్ను ఆర్పకుండా చూస్తున్నాడు. దాదాపు పది నిమిషాలు ఏం మాట్లాడకుండా ఒకరినొకరం చూసుకుంటున్నాం. ప్రభువు నా గురించి ఏమి ఆలోచిస్తున్నాడో కాని, నేను మాత్రం ఆయన రూపురేఖలు చూస్తూ ఈయనది జపాన్ ముఖమా, చైనా ముఖమా? ఏదీ కాదు మన ముఖమే. ఆసియా వాసుల ముఖమే అని అలా ఆలోచిస్తున్నాను.

తర్వాత ఆయన లేచి నేను వచ్చిన వాకిట్లో గుండా వెళ్తున్నాడు. నేను లేచి ఆయనను అనుసరించాను. నా వెనుక పేతురుగారు వస్తున్నాడు. కాని నేను యేసు మీద నుండి నా కళ్లు త్రిప్పలేదు. సాయంకాలం సూర్యుడు ఆయన వీపు మీద పడుతున్నాడు. ఇంట్లో లేతపచ్చరంగులో వున్న అంగీ ఇప్పుడు సూర్యకిరణాల వల్ల ముదురు ఆకుపచ్చరంగుకు వచ్చింది. ఇంటి ప్రక్కగా ముగ్గరం నడుస్తున్నాము. ఇంటి ముందు భాగమున పెద్ద వీధి. పట్టణమంతయు ఆ యింటి వాకిట కూడియున్నది. ఆయనను చూడగానే అంతా లేచి నిల్చున్నారు. కాని ఎవరూ గోల చెయ్యటం లేదు. ఇంటి చుట్టూ చెక్క ఫెన్సింగ్ వుంది. ఇంటిముందు గేటు ఎదురుగా ప్రభువు నిలుచున్నాడు. నేను ఆయన ఎడమ ప్రక్కన నిలుచున్నాను. నా ఎడమ ప్రక్కన పేతురుగారు నిలుచున్నాడు. అయినా నేను పేతురుగారి ముఖం చూడలేదు. ప్రభువు ముఖం నుండి నా కన్నులు త్రిప్పలేదు. ఆయన తల త్రిప్పి నన్ను చూశాడు. నేను వెళ్ళి మా ఎదురుగా వున్న పెద్ద గేటు పైన వేయబడిన గడియ తీసి ప్రభువు వైపు చూస్తూ వచ్చి మామూలుగా ఇందాక నిలబడివున్న చోటనే నిలుచున్నాను. గేటులో నుండి లోనికి వచ్చిన ఒక యౌవనస్తుడు ప్రభువు ఎదురుగా నిలబడ్డాడు. ఆయన తన రెండు చేతులు ఆ యౌవనస్తుని కణతల మీద పెట్టి, తల పైకెత్తి చూస్తున్నాడు. ఎడమ ప్రక్కన నిలుచున్న నేను ఆయన ముఖం చూస్తూ నాలాగా యేసుప్రభువును ఇలా దగ్గరగా నిలిచి చూసే భాగ్యం లోకంలో ఎవరికీ కలుగలేదు అనుకున్నాను. ఆ రోగియైన యౌవనస్తుని రోగమంతా ప్రభువు తన శరీరంలోనికి తీసుకుంటు న్నాడు. ఆ యౌవనస్తుని ముఖం ఇప్పుడు తేటగా మారింది. ప్రభువు చేతులు అతని మీద నుండి తీస్తూ నావైపు చూశాడు. అతను స్వస్థత పొందినవాడై ప్రభువు కుడివైపుగా లోపలకి వెళ్ళాడు.

ఇంతలో చాలమంది మనుష్యులు పెద్ద పెద్దగా మాట్లాడు కుంటూ ధనధనమని మెట్లు ఎక్కుతున్న శబ్దం వినిపించి నా తలతిప్పి ఎడమవైపుకు చూశాను. నేను కూర్చున్న మంచము వెనుక క్రింద నుండి పైకి మెట్ల మీదుగా జానెట్ పైకి వచ్చింది.

ఆమె వెనుక సూసన్, సామ్రాట్, పాస్టర్లు పైకి వచ్చారు. వారిని ముందు రానీయకుండా జానెట్ వారికి అడ్డంగా నిలబడి నావైపు వింతగా చూస్తుంది. ఆమె నన్ను అంతకుముందు చూచి ఉండ లేదు. ఆమె అలా ఎందుకు చూస్తుంది? అక్కడే ఎందుకు నిలబడిపోయింది అనుకుంటూ నా రెండు పాదాలు, కాళ్ళు, నా చేతులతో ఎత్తి ఇవతల పెట్టి లేచి నిలబడి ఆమె వైపుగా నడవడం ప్రారంభించాను. ఆమె వెంటనే కదిలి, నా వైపు వస్తూవుంది. కాని ఆమె మెడవంచి, కళ్ళు పైకెత్తి నన్ను పరీక్షగా చూస్తూ నా దగ్గరకు వస్తూ ఉంది. ఆమె నా కళ్ళలోకి కళ్ళు పెట్టి చూస్తూ 'ఇప్పటిదాకా నువ్వు ప్రభువు ఎదురుగా నిలబడి ఆయన కళ్ళలోకి చూస్తున్నావు కదూ!' అంది. ఔను నేను ప్రభువు ముఖం చూస్తూ ఉన్నాను కదా అనుకున్నాను. "నువ్వు ప్రభువును చూస్తున్నావు. నేను కూడా మీ ఇద్దరిని చూశాను, కానీ నేను ప్రభువు వీపు మాత్రం చూస్తున్నాను. నువ్వు ఆయన ముఖం చూస్తున్నావు. ఈ లోకంలోని మరెవరూ ప్రభువు ముఖం చూడలేదు. నువ్వైతే నీ యీ కళ్ళతో ఆయనను చూస్తున్నావు. నేను వెనుక భాగం చూశాను ఆయన ముఖం చూడలేదు. నువ్వు ధన్యుడవు" అన్నది.

నా ఎదురుగా వున్న కుర్చీలు చూపించి వారిని కూర్చో మన్నాను. ఆమె వెంటనే 'నేను కూర్చోను నువ్వు ప్రభువును చూశావుగా' అన్నది. ప్రార్థన చెయ్యమని అడిగాను ఆమెని. 'నేను చెయ్యను, నువ్వు ప్రభువును చూశావుగా అన్నది. ఆమె దగ్గరగా వచ్చి 'నీ కాళ్ళు కడుగుతాను' అంది. నేను ఆశ్చర్య పోయి సామ్రాట్‌ని 'ఈమె రోగికి ప్రార్థన చేసేముందు వాళ్ళ కాళ్లు కడుగుతుందా?' అని అడిగాను. 'లేదు పెదనాన్న, ఈమెతో గత పదిరోజులుగా తిరుగుతున్నాము, ఆమె ఎవరి కాళ్ళూ కడగలేదు' అన్నాడు. ఆమె సామ్రాట్ వైపు తిరిగి 'నేను మీ పెద్దనాయన కాళ్ళు కడుగుతానని ఆయనకి చెప్పండి' అన్నది. 'ఆయనకు ఇంగ్లీషు వచ్చు' అన్నాడు సామ్రాట్. నా కూతురు పెద్ద బేసిన్, ఓ జగ్గుతో నీళ్ళు తెచ్చి నా పాదాల మీద నీళ్ళు పోస్తుంటే జానెట్ నాకు ఎదురుగా నేలమీదకు వంగి నా రెండు మోకాళ్ళ నుండి పాదాల వరకు కడిగి లేచి నా ప్రక్కగా వచ్చి తన కుడి చేయి నా కుడి భుజం మీద వేసి నిలబడింది. మీరు ఏ దేశం నుండి వచ్చారు, ఎంతకాలం వుంటారు, మీ వయస్సెంత మొదలైన ప్రశ్నలు అడుగుతుంటే ఆమె జవాబు చెప్పి 'ఇక వెళ్తాము' అన్నది. 'ప్రార్థన చేసి వెళ్లండి' అన్నాను. 'లేదు, నువ్వు నీ కళ్ళతో ప్రభువును చూశావు' అని సబ్బుతో చేతులు కడుక్కుని వెళ్ళిపోయింది.

మరుసటిరోజు హైదరాబాద్ వెళ్ళి పరీక్ష చేయించుకొని వెంటనే ఒంగోలు రావాలి అనుకున్నాను. ఉదయం 8 గంటలకు డా॥ కృపారావుగారి హాస్పిటల్‌కి వెళ్ళాము. అక్కడి నర్సులు ఇద్దరు నా దగ్గరకి వచ్చి 'ఇంత కడుపు అయ్యేదాకా వుండి, ఇప్పుడు చావటానికి మా ఆస్పత్రికి వచ్చావా' అని కోపంగా అన్నారు. 'అదికాదు కృపారావు నా స్నేహితుడు. ఆయనను చూడటానికి వచ్చాను' అన్నాను. అందుకు వారు 'ఆయన ఆ చివరి గదిలో వుంటారు, ఆయన చాలాకాలంగా పేషెంట్స్‌ని చూడటంలేదు, ఆయన కుమారుడు కేశవబాబు చూస్తున్నారు' అని చెప్పారు. నేనింత వరకు కేశవబాబును చూడలేదు. ఆయన గదిలోకి వెళ్ళి 'నేను మీ తండ్రిగారి స్నేహితుడను, ట్రీట్మెంట్ కోసం రాలేదు, నా పరిస్థితి ఎలా వుందో తెలుసుకుందామని వచ్చాను' అని చెప్పాను. అందుకు ఆయన 'మీరు లోపలికి వచ్చేటప్పుడే చూశాను, మీరు రెండురోజుల కంటే ఎక్కువకాలం బ్రతకరు' అని 'అయినా మీరు హైదరాబాద్ వెళ్ళాలనుకుంటే డా॥ నాగేశ్వరరెడ్డిగారి వద్దకు వెళ్ళి ప్రయత్నించి చూడండి. పంజా గుట్టలో మెడినోవా వ్యాధి నిర్ధారణ కేంద్రం అది అన్నాడు. 'సరే, రిఫర్ చేయండి, హైదరాబాద్ వెళ్ళాలను కుంటున్నాం' అని చెప్పాను. 'ముందు మీ రైల్వే రిజర్వేషన్ టిక్కెట్టు చూపండి అప్పుడు వ్రాసి ఇస్తాను' అన్నాడు. డా॥ కేశవబాబు దగ్గర లెటర్ తీసుకొని ఆ రాత్రే హైదరాబాదు బయలుదేరాం. పంజాగుట్టలోని మెడినోవాకు ఉదయం 10-30కి వెళ్ళాము. గదిలోకి తీసుకెళ్ళి నోట్లో ఇనుపగొట్టం పెట్టి వెలుగుతున్న రెండు చిన్న బల్బులు నా కడుపులోకి దించి కంప్యూటర్‌తో ఫోటో తీశారు. తర్వాత సాయంకాలం మూడు గంటల వరకు ఎన్నెన్నో పరీక్షలు చేశారు.

చివరలో ఎక్కడో ఒక గదిలో కూర్చున్న డా॥ నాగేశ్వర రెడ్డిగారి వద్దకు తీసికొని వెళ్ళారు. ఆయన చేతిలో నా పరీక్షల కాగితాల కట్ట వుంది. ఆయన వాటిని చూస్తూ, నేను లోపలికి రాగానే 'ఇవన్నీ మీ పరీక్షల కాగితాలు, ఇవికాక మీరు 15 రోజుల క్రితం ఒంగోలులో స్కానింగ్ చేయించిన కాగితాలు వున్నాయి. ఒంగోలులో చేయించిన స్కానింగ్‌లో మీకు 80 శాతం జబ్బు వున్నది. అంత జబ్బుతో ఎవరూ బ్రతకరు. కాని మీరు బ్రతికే వున్నారు. మా స్కానింగ్ మిషన్లు అన్నీ విదేశాల నుండి వచ్చినవి. చాలా మంచి మిషన్లు. కాని వాటిలో

**(మిగతాది 18వ పేజిలో)**


## ఇశ్రాయేలుకు (క్రైస్తవులకు)
# తెలివిలేదు, యోచింపరు

దేవున్ని ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలసిన క్రైస్తవులు ఆచారముగా, మనుష్యులు కల్పించిన పద్ధతుల ప్రకారం దేవున్ని వ్యర్థముగా ఆరాధిస్తున్నారు. యోహాను సువార్త 4వ అధ్యాయంలో యేసుప్రభువు సమరయ స్త్రీతో మాట్లాడుతూ, దేవున్ని ఎలా ఆరాధించాలో చెప్పాడు. ఏదో ఒక ప్రదేశములో, తనను ఆరాధించేవారు కాక, ఆత్మతోను, సత్యముతోను ఆరాధించే వారు కావలెనని తండ్రి కోరుతు న్నట్లు యేసుప్రభువు చెప్పాడు. అయితే నేటికాలంలో, ప్రతి ఆదివారం చర్చికి వెళ్ళేవారు, విరివిగా ఉపయోగించే పదం, ఆరాధన. ఆరాధన అంటే ఏమిటని అడిగితే, వచ్చే సమా ధానం, చేతులెత్తి దేవున్ని స్తుతించటం లేదా పాటలు పాడటం లాంటి రకరకాల సమాధానాలు వస్తాయి. చాలా చర్చీల్లో ఆరాధన సమయం అనగానే అందరూ లేచి నిలబడి, చేతులు పైకెత్తి అటూ ఇటూ ఊపుతూ పాట పాడుతూ, తన్మ యత్వంతో ఊగిపోతుంటారు. వారి దృష్టిలో ఆరాధన అంటే నిలబడి చేతులూపుతూ, తన్మయత్వంతో పాడటం. అయితే, నిజానికి ఆరాధన అంటే, దేవున్ని ఆయన గుణాలనుబట్టి, ఆయన వ్యక్తిత్వాన్నిబట్టి స్తుతించటం. ఆయనకు ఉన్నటువంటి గొప్ప లక్షణాలను మనం తెలుసుకుంటే, అది ఆదివారమై నా, ఏ వారమైనా ఆయనను స్తుతించకుండా ఉండలేము. కేవలం ఆదివారం చేసేది మాత్రమే ఆరాధన కాదు. వాడుక ప్రకారం చేసే ఆచారాలను ఆరాధన అనరు. *"మానవులు కల్పించిన పద్ధతులు, దేవోపదేశములని బోధించుచు, నన్ను వ్యర్థముగా ఆరాధించుదురు"* (మార్కు 7:7). చర్చిలో పదిమందితో కలిసి పెద్దగా అరుస్తూ, గెంతుతూ, డాన్సులు చేసేది ఆరాధన అవ్వదు. ఆరాధన అనేది వ్యక్తిగతమైనది, మనం ఒంటిరిగా ఉన్నప్పుడు దేవుని గురించి ఆలోచించుకోవడం, ఆయన ఉన్నతమైన లక్షణాలను అనుక్షణం తలపోయటం, ఆయనను ఆత్మతో ఆరాధించటమవుతుంది. ఆత్మ ఎవరికీ కనబడదు. అలాగే మనం ఆత్మతో ఆరాధించి నప్పుడు, అది పదిమందికి కనబడదు. మన హృదయంలో నిత్యం తలపోసుకోవడం, ఆరాధన అవుతుంది. మనకు ఎవరైనా చిన్న సహాయం చేస్తే, వారిపట్ల మనం కృతజ్ఞత కలిగి ఉంటాము. మనం ఎవరినైనా ప్రేమిస్తుంటే ఆ ప్రేమను ప్రత్యక్షంగా తెలియజేయటానికి వారికి బహుమతులు ఇస్తాము, వారిని సంతోషపెట్టాలని చూస్తాము. పరోక్షంగా ఎప్పుడూ వారి గురించి ఆలోచిస్తూ, వారిని ఇంకా సంతోష పెట్టటానికి ఏం చేయాలా అని ప్రణాళికలు వేసుకోవడమే ఆరాధించడం అవుతుంది. మరి మనల్ని పుట్టించి, పరిపూర్ణ ఆరోగ్యం, తెలివితేటలు ఇచ్చిన దేవుడు అద్వితీయుడు అని, నిన్న నేడు ఒకే రీతిగా ఉన్నవాడు, కరుణ చూపేవాడైన ఆ దేవదేవునిపట్ల, మనసులో ఉన్న కృతజ్ఞతా భావనను, ఆయనకు హృదయ పూర్వకంగా తెలియజేయటమే ఆత్మతో, సత్యముతో ఆరాధించ టమవుతుంది తప్ప, వాడుక ప్రకారం చేసేది మాత్రం ఆరాధన కాదు. దేవుడు మన హృదయమంతా, నిండి వున్నప్పుడు చేసేదే నిజమైన ఆరాధన.

ఈ రోజుల్లో ఏ సంఘములో కూడా నిజమైన ఆరాధన జరగటం లేదు. ఎందుకంటే సాతాను తానే వెలుగుదూత వేషము ధరించి ఆలయంలో కూర్చున్నాడు. "ఏది దేవుడన బడునో, ఏది పూజింపబడునో, దానినంతటిని ఎదిరించుచు, దానికంతటికిపైగా వాడు తన్నుతానే హెచ్చించుకొనుచు, తాను దేవుడనని తన్ను కనుపరచుకొనుచు, దేవుని ఆలయ ములో కూర్చుండును గనుక ఏ విధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచనియ్యకుడి" (2థెస్స. 2:4). క్రైస్తవులకు వ్యక్తిగతంగా బైబిలు చదివి ధ్యానించి ఏది నిజమో, ఏది అబద్ధమో తెలుసుకోవాలి అన్న తీరిక లేకపోవడం వలన సంఘకాపరులు వారికిష్టమొచ్చినట్లు సంఘాలను నడిపిస్తూ, లాభాపేక్ష కలిగి సంఘస్తులను దోచుకుంటున్నారు. "ఏలయ నగా అట్టి వారు క్రీస్తుయొక్క అపొస్తలుల వేషము ధరించు కొనువారై యుండి, దొంగ అపొస్తలులును మోసగాండ్రగు పనివారునై యున్నారు" (2కొరింథీ. 11:13). వ్యక్తిగతంగా వాక్యమును పరిశీలనగా దివారాత్రము చదవలేని క్రైస్తవులకు తెలివిలేదు, వారు యోచింపరు. **(సశేషం)**

# బైబిల్ ప్రాముఖ్యత

బైబిలులోని ప్రతి పుస్తకంలో పరిశుద్ధాత్మ దేవుడు గ్రంథకర్తకు ఒక విషయం బోధించి వ్రాయించి ఉంటాడు. వీలైనంత వరకు పుస్తకంలోని పేజీలను మొదటి నుండి చివరి వరకు అధ్య యనం చేస్తే గ్రంథకర్త ఉద్దేశ్యం, పరిశుద్ధాత్ముని పని మన జీవితంలో సఫలం అవుతుంది. అలాగే బైబిల్లో ఆదికాండం మొదటి అధ్యాయం మొదటి వచనం నుండి ప్రకటన ఆఖరి అధ్యాయం ఆఖరి వచనం వరకు అధ్యయనం చేయడంలో ఎంతైనా ఆశీర్వాదం ఉందంటే అతిశయోక్తి కాదు. ప్రయత్నం చేయండి. దేవుని రక్షణ ప్రణాళిక బైబిల్ మొదటి పేజీ నుండి ఆఖరి పేజీ వరకు భద్రపరచబడి ఉంది. కనుక బైబిల్ని ఒకే ఒక పుస్తకంగా భావించి పూర్తి చేయడంలో ఆశీర్వాదం ఉందని మరొక సారి చెప్పవచ్చును. అందుకే ఆది క్రైస్తవ సంఘకాపరులు 66 పుస్తకాలలోని ఆది కొత్త నిబంధనలు అని కూడా అనడం పరిపాటే. పుస్తకంగా చదివినా, 66 పుస్తకాలను ఒకే పుస్తకంగా భావించి అధ్యయనం చేసినా ఒక ప్రణాళిక వేసుకొని అధ్యయనం చేస్తే మంచిది. చాలామంది మౌనంగా గదిలో కూర్చుని ప్రతి వరుసని పదేపదే చదివి అర్థం చేసుకుంటూ ఉంటారు. మరికొందరు పెదవి విప్పి గొంతు తెరచి చదువుతుంటే అర్థం అవుతుంది. ఆనందంగా ఉంటుంది అంటారు. చాలా కుటుం బాలలో కుటుంబ ప్రార్థనలలో బైబిల్ మొదటి నుండి చివరి వరకు అధ్యాయనం చేసే అలవాటుంది.



అది చాలా మంచిది. ఇలా ప్రార్థనలో కూర్చునప్పుడు ఒక్కొక్కరు ఒకటి రెండు వచనాలు చదివి ఆ దిన పాఠ మును ముగిస్తుంటారు. ఇలాగే ఒకసారి అమెరికాలోని ఓక్లహోమా రాష్ట్రంలో ఒక బాప్టిస్ట్ సంఘ పాస్టర్గారైన రెవ. విల్బర్ నకల్స్ ఆయన సంఘ సభ్యులు జాతీయ దృష్టిని ఆకర్షించడానికి ఆ సంఘంలో బైబిల్ ఆపకుండా చదవడం మొదలుపెట్టారు. ఒక బుధవారం ఉదయం సరిగ్గా. 9 గంటలకు పాస్టర్ నకల్గారు ప్రసంగ వేదికనెక్కి "ఆది యందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను అని మొదలుపెట్టి దాదాపు పదిహేను నిమిషాల అనంతరం అదే స్థలంలో మరియొక సంఘ సభ్యురాలు పాస్టరుగారు ఆపిన దగ్గర నుండి చదవడం ప్రారంభించారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు చదువుతూ ఆదికాండము, నిర్గమకాండము ఇలా పాత నిబంధన కొత్త నిబంధన పుస్తకం వెంబడి పుస్తకం చదువుతూ చివరిగా ఆదివారం తెల్లవారు జాము 3 గంటల 55 నిమిషాలప్పుడు ఒక పాప ప్రకటన గ్రంథంలోని ఆఖరి వచనం "ప్రభువైన యేసుక్రీస్తు కృప పరిశుద్ధులకు తోడై యుండును గాక! ఆమెన్" అని చద వటంతో పూర్తి అయిందట. ఇలా చద వడానికి దాదాపు 78 గంటల 55 నిమిషాలు పట్టింది. మంచిది ఇది ఒక సవాలే మనంద రికి చదవడమే కాదు దానిని అర్థం చేసుకొని అనుసరించి నడచి మనకు ఇతరు లకు మేలు కరంగా ఉండాలి. ప్రతి చదువరికి ఒక ఆసక్తికరమైన బైబిల్ భాగం ఉండవచ్చు. కొందరికి పాతనిబంధనలోని వ్యక్తుల చరిత్ర, కొందరికి ప్రవచన పుస్తకాలు, కొందరికి సువార్తలు, కొందరికి పత్రికలు, కొందరికి ప్రకటన, కీర్తనలు, సామెతలు, యోబు అలాగే కొందరికి కొన్ని అధ్యాయాలు కీర్తనలు 23, 1కొరింథి. 13వ అధ్యాయం లేదా వచనాలు యోహాను 3:16, రోమా 6:23, ఇలా అనేకం. బైబిల్ గ్రంథంలో పుస్తకాలలో ఒక అనుబంధం కనిపిస్తుంది. ముందుగా చెప్పుకున్నట్లు మొదటి పేజీ నుండి ఆఖరి పేజీ వరకు ఒకే అంశం "యేసుక్రీస్తు -మానవాళి రక్షణ" కనిపిస్తుంది కదా. బైబిల్లో ఆయన భక్తులు అనేక చోట్ల ఈ వాక్యమును వారి అనుభవంలో ఏమి చెప్పారో చూద్దాం! "దుష్టుల ఆలోచన చొప్పున నడువక పాపుల మార్గమున నిలువక అపహాసకులు

కూర్చుండు చోటను కూర్చుండక యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్ర ములు దానిని "ధ్యానించువాడు ధన్యుడు" కీర్తన 1:1,2. ఈ వాక్యమునుబట్టి చూస్తే కీర్తనాకారునిలో ధర్మశాస్త్రమును చదవాలని, ధ్యానించాలనే ఒక తపన, ఆశ, ధ్యానించడం వల్ల కలిగే కొదువలేని నిత్యానందకరమైన జీవితం తెలుస్తుంది. అందుకే కీర్తన 119:103వ వచనంలో కీర్తనాకారుని ఈ వాక్యములు తన జిహ్వకు ఎంతో మధురములుగాను నోటికి తేనెకంటే తీపిగాను ఉన్నాయని వ్రాశాడు. కీర్తన. 19:10లో బంగారు కంటెను విస్తారమైన మేలిమి బంగారు కంటెను కోరదగినవి తేనెకంటెను జుంటితేనె ధారలకంటెను మధురమైనవిగాను, కీర్తన. 119:127లో బంగారు కంటెను అపరంజికంటెను ప్రియమైనవిగాను కీర్తనాకారుడు వ్రాస్తాడు.

అలాగే ఒకసారి యేసుక్రీస్తువారు తనను నమ్మిన యూదులలో తాము శిష్యులుగా ఉండగోరిన యెడల వాక్యమందు స్థిరమైయుండవలెనని చెప్పడం గమనార్హం (యోహాను 8:31). మోషే చనిపోయిన తర్వాత, నాయకత్వమునకు వచ్చిన యెహోషువతో యెహోవా దేవుడు–'ఈ ధర్మశాస్త్ర గ్రంథమును నీవు బోధింపక తప్పిపోకూడదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దానిని ధ్యానించిన యెడల నీ మార్గమును వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు' (యెహోషువ 1:8) అని సెలవిచ్చిన ఈ ప్రతి మాటలో ఆజ్ఞలు, వాగ్దానాలు కనిపిస్తున్నాయి. "మీరు విను మాత్రమైయుండి. మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్య ప్రకారం ప్రవర్తించువారునై యుండుడి... విని మరచువాడు కాక క్రియను చేయువాడై యుండి తన క్రియతో ధన్యుడగును" (యాకోబు 1:22–25). పౌలుగారు కొలస్సీయులకు క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి' (కొలస్సీ 3:16) అని వ్రాశాడు. యేసుక్రీస్తు వారి పరిచర్య దినాలలో ఒక స్త్రీ ఆయనను చూచి 'నిన్ను' మోసిన గర్భమును నీవు కుడిచిన స్తనములును ధన్యములైనవని కేకలు వేసి చెప్పగా ఆయన అవును గాని మరి దేవుని వాక్యము విని దానిగైకొనువారు మరి ధన్యులు" అని చెప్పెను (లూకా 11:27,28).

**(సశేషం)**


## తృతీయ జ్ఞాపకార్థ కూడిక



జననం: 17-08-1940
మరణం: 03-07-2023

క్రైస్తవ నవలా రచయిత, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక వ్యవస్థాపకులు

**కీ॥శే॥ కొడవటికంటి సామ్యేల్ రాజేంద్రగారి**

**తృతీయ జ్ఞాపకార్థ కూడిక తేది 03-07-2026 శుక్రవారం ఉదయం 10-00 గంటలకు ఒంగోలు, క్లౌపేట, 6వ లైనులోని ప్రభువు సంఘమునందు జరుగును. కావున హన్నాకృప పాఠకులు, ఆప్తులు, మిత్రులు, అభిమానులు తప్పక పాల్గొనవలసినదిగా ఆహ్వానించుచున్నాము.**

ఇట్లు
**కుటుంబ సభ్యులు**

# మదర్ తెరీసా

ఆ తల్లి బాధ తీరింది. చల్లని హస్తాల్లో ఆ బిడ్డ ఉంచబడిందని తృప్తిగా వెళ్ళిపోయింది. తరువాత ఎప్పుడూ శిశు భవన్‌కు రాలేదంటే, చనిపోయిందేమో. సిస్టర్లు ఆ పిల్లవానికి బాపి అని పేరు పెట్టారు. బాపి సైగల భాషను సిస్టర్లు అర్థం చేసుకుని కంటికి రెప్పలా చూసుకుంటూ ఉండే వారు. ఆ పిల్లవాడు కూర్చోవాలనుకుంటున్నా, పడుకోవాలనుకుంటున్నా, టాయిలెట్‌కి తీసుకెళ్ళండని అంటున్నా, చక్రాల కుర్చీలోకి తీసుకు వెళ్ళండని చెప్పాలనుకున్నా అతని సైగను బట్టి అర్థం చేసుకోవడం మొదలుపెట్టారు. అతడు ఉల్లాసంగా ఎప్పుడుంటాడో, ఎప్పుడు కళ్ళమ్మట నీళ్ళు తిరుగుతాయో వాళ్ళు గ్రహించగలరు. తమ సంరక్షణలో ఉండే యితర పిల్లల్ని ఎంతలా వెయ్యికళ్ళతో చూసుకుంటారో, అంతలా బాపిని చూసుకోవడం వాళ్ళకు సహజం. బాపిది చక్కని ముఖం, నల్లని కనుబొమ్మలు. ప్రతి గంటకోసారి ద్రవాహారం ఇస్తారు. ఈ విధమైన సంరక్షణలో బాపి పద హారు సంవత్సరాల వయసు  వరకు బ్రతికి చనిపోయాడు. ఇలాంటి  విషాదగాధలు ఎన్నో శిశుభవన్‌లో ఉంటాయి.

బాపివంటి బిడ్డ విషయం ఈ మధ్య పేపర్‌లో ప్రచురించారు. పుట్టినప్పటి నుండి ఏడుపే తెలియని శిశువుకు జన్మనిచ్చిన తల్లిబాధను వ్రాశారు. ఆ బిడ్డ ఏడుపు, నవ్వు తెలియనిది. ఏడు సంవత్సరాల వయసు వచ్చినా ఆకలే తెలియని చిన్నవారికి ఆకలి తీర్చి కంటికి రెప్పలా కాపాడటం ఆ తల్లికి ఎంత కష్టం. ఆకలి ఏడుపులు ఏడవలేదు. మాట్లాడలేదు. మౌనంగా చూస్తూ ఉంటుంది. శరీరం పెరుగుతున్నా దేహంపై కండ పెరగటం లేదు. ఎముకలు తేలి వుంటుంది. అటువంటి ఆ పాపను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తుంది ఆమె తల్లి. హైదరాబాద్‌లోని లాలాపేట ప్రశాంత్ నగర్‌లో శ్రీనివాస్, రజిని అనే తల్లిదండ్రులకు తొలి సంతానంగా 2004లో జ్యోతి అనే ఈ పాప జన్మించింది. పుట్టినప్పటి నుండి ఆ కూతురు ఏడుపు అనేది ఎరుగదు. ఏడిపించడానికి వైద్యులు శత విధాల ప్రయత్నించినా ఫలితం రాలేదు. చిరునవ్వులు, ఏడుపులులేని ఆ బిడ్డకు వారు జ్యోతి అని నామకరణం చేశారు. ఆ పాప పేరుతోనే శ్రీనివాస్ ప్రశాంత్‌నగర్‌లో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. జ్యోతి ఆరోగ్య విషయంలో ఎందరో వైద్యులను కలిసినా లాభం లేకపోయిందని ఆ దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. తన బిడ్డ జ్యోతి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు ఛాలెంజ్‌గా తీసుకొని బాగుచేస్తే తమ శక్తి కొద్ది అప్పో సొప్పో చేసి డబ్బులు ఇస్తామన్నారు. తమ బిడ్డ విషయంలో ఏనాడూ విసుకు చెందలేదని, ఈ జ్యోతిని ఆరిపోకుండా చేస్తే వారి ఆనందనానికి అవధులు ఉండవని అంతర్జాతీయస్థాయి వైద్యులతో వైద్యం చేయించాలని కోరుతున్నారు. ఈ తల్లి దండ్రులకున్న బిడ్డలాంటి బాపిని మదర్ తెరీసా పదహారు సంవత్సరాల వయసు వరకు పెంచిందంటే ఎంత ఆదరణ చూపించారో గదా!

సూపర్ సాకర్ హీరో అయిన డీగో మారడోనా కలకత్తా పర్యటన వెనుక ఆయన కోరిక వెలిబుచ్చారు. మదర్ తెరీసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీస్‌ను సందర్శించాలనే డీగో మారడోనా స్వప్నం సాకారమయ్యిందంట. డిసెంబరు 2008, రెండవవారం డిగో మారడోనా మదర్ హౌస్‌లో అడుగుపెట్టగానే పక్షవాతంతో బాధపడుతున్న ఎనిమిదేళ్ళ చిన్నారి మేఘను ఆత్మీయంగా దగ్గరు తీసుకుని ముద్దాడాడు. ప్రతిఫలంగా మేఘ భారత క్రికెటర్లు ధరించే నీలంరంగు టోపీని మారడోనాకు బహుకరించింది. అనంతరం తన కోసం వేచి చూస్తున్న నలభైమంది చిన్నారులను కూడా మారడోనా ఆప్యాయంగా ముద్దాడాడు. మదర్ హౌస్‌ను సందర్శించడం ద్వారా కోల్‌కతాలో తన పర్యటన లక్ష్యం నెరవేరిందని ప్రస్తుతం అర్జెంటీనా జాతీయ జట్టుకు కోచ్‌గా

వ్యవహరిస్తున్న ఈ సాకర్ మాంత్రికుడు పేర్కొన్నారు. ఫ్రెంచ్ భాష తెలిసిన నన్ ఒకరు మదర్ తెరీసా బోధలను, ఆమె చేసిన సేవలను మారడోనాకు వివరించారు. అనంతరరం మదర్ సమాధిని సందర్శించి కొవ్వొత్తులు వెలిగించి నివాళు లర్పించారు. ఈ విధంగా ప్రపంచంలో ఎందరికో మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సంస్థ సందర్శన ప్రియమైన స్థలంగా మారింది.

మదర్ తెరీసా శిశుభవన్ పిల్లల్ని దత్తతకివ్వడం ద్వారా వారు కుటుంబ పోషణలో జీవించే అవకాశం ఉంటుందని ప్రోత్సాహించేవారు. భారతదేశంలోనేకాక ఇతర దేశల వారు కూడా శిశుభవన్ పిల్లల్ని దత్తత తీసుకోడానికి వచ్చేవారు. విదేశాలకు పిల్లలను దత్తత ఇచ్చే విషయం విమర్శలకు గురవుతూనే ఉంది. పిల్లల్ని అమ్ముకోవడమనేది ప్రపంచ వ్యాప్తంగా 'పిల్లల వ్యాపారం' అని వార్తలు వెలువడుతూనే ఉంటాయి. కొన్నిసార్లు ఆ వార్తల్లో అతిశయోక్తులు లేవని తేలుతుంది. ప్రపంచవ్యాప్తంగా సంపన్నులు అందమైన పిల్లల్ని కొనుక్కోడానికి ఎంతైనా చెల్లిస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లల్ని అపహరించుకుపోయే సంఘట నలు జరుగుతూనే ఉన్నాయి. దానివల్ల విదేశీ దత్తతలు మందగించడం జరుగుతుంది లేదా దత్తత విధానాన్ని పునః పరిశీలించడమూ అవసరమవుతుంది. పత్రికా వార్తల వల్ల మదర్ తెరీసా దత్తత ఇవ్వడం ఆపుచేసిన సందర్భాలున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన తృతీయ ప్రపంచం నుండి పిల్లల్ని యూరపు దేశములో దత్తతకోసం పంపించి ఆ పిల్లల్ని వైద్య పరిశోధనలకు వాడుకుంటున్నారని ఒక పత్రికలో సంచలనా త్మక కథనం ప్రకటించబడింది. ఆ పత్రిక ప్రకటన చూసి మదర్ తెరీసా మనఃస్థాపానికి గురై వెంటనే ఢిల్లీ వెళ్ళి ఆ దేశ అంబాసిడర్‌ను కలిసి తన ఆందోళనను వివరించింది. ఆ కథనం దారుణమనీ అప్రతిష్టాకరమనీ ఆ పత్రిక సంపాద కునికి లేఖ వ్రాశారు. ఆ పత్రిక క్షమాపణ చెప్పింది.

దేవుని దయ మరియు ఆమె చిత్తశుద్ధి వలన ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఎక్కడో దిక్కులేని చావుకు గురి కావలసినవారో లేక అనాధలుగా బ్రతకవల సిన బిడ్డలు తమ జీవితాలలో మేలైన బ్రతుకులు జీవించడా నికి మదర్ తెరీసా ద్వారా ప్రణాళిక చేయబడినట్లు మనం చూడగలము. స్విట్జర్లాండులో జోమిల్లర్‌గారు 'దీపావళి దత్తత సేవా సంఘం' స్థాపించారు. ఈ సంస్థవారు బిడ్డలను దత్తతకు తీసుకునే కుటుంబాలను క్షుణ్ణంగా పరిశీలించి వారి వివరాలను మదర్ తెరీసా సిస్టర్స్‌కు సమర్పించేవారు. మదర్ తెరీసా సిస్టర్స్ దత్తతకు ఇవ్వబడే బిడ్డల యొక్క వివరాలను, వారికున్న శారీరక, మానసిక లోపాలు ఏమైనా ఉంటే వాటిని, వారిని ఏలాటి వాతావరణంలో పెంచితే బాగుం టుందనే అంశాలను వారికి తెలియజేసేవారు. ఈ విధంగా దత్తతకు సంబంధించి ఆ కుటుంబ పరిస్థితులు, దత్తకు వెళ్ళబోయే బిడ్డ విషయాలు సరి చూసుకుని సరియైన అవగాహనతో నిర్ణయం తీసుకునే వారు. దత్తతకు వెళ్ళబోయే బిడ్డ అంగీకారాన్ని తీసుకొని ఆ ఫోటోను ఆ కుటుంబానికి చూపేవారు. అన్ని లాంఛనాలు పూర్తి చేసుకుని దత్తత చేసు కున్న బిడ్డతో వారి దేశానికి వెళ్ళేవారు. ఇలా దత్తతకివ్వ బడిన బిడ్డలు కొంత కాలానికి పెరిగి పెద్దవారై ప్రయోజకు లైన తరువాత మిషనరీస్ ఆఫ్ ఛారిటీస్‌లో వాలంటీర్లుగా పనిచేసి వెళ్తూ వుంటారు. ఎంత గొప్ప ప్రణాళిక గదా! ఫ్రాన్సు దేశములో ఒక కుటుంబం దత్తత తీసుకున్న అమ్మాయి చెత్తకుండీలో అరచేతిలో సరిపోయేంత చిన్న ఆకారముతో నెలలు తక్కువగా జన్మించిన బిడ్డగా మదర్ తెరీసా సిస్టర్స్‌కు దొరికింది. ఈ బిడ్డ ఫ్రాన్సు దేశములో పెరిగి పెద్దదై ఒక నర్సుగా శిక్షణ పొంది ఆమె శెలవులలో శిశుభవన్ వాలం టీర్‌గా చేసి తిరిగి తన దత్తత తలిదండ్రుల వద్దకు వెళ్ళేది. ఇదే బిడ్డ అబార్షన్‌కు గురై పుట్టకుండా ఉండి ఉంటే లేక మదర్ తెరీసా సిస్టర్స్ ఈమెను చెత్తకుండీ నుండి కాపాడ కుంటే, కాపాడి మంచి సంపన్న కుటుంబంలో దత్తతకు పంపబడి తిరిగి తనలాగా అభాగ్యులుగా జన్మించిన వారికి సేవ చేసే అవకాశం వచ్చిందంటే ఆ బిడ్డ యెడల దేవుని ప్రణాళిక ఎంత గొప్పది గదా. అందుకే మదర్ తెరీసా ఏ బిడ్డను ఎవరు చంపకూడదని. ముఖ్యంగా అబార్షన్ చేయించి బిడ్డలను చంపడానికి ఎవరికీ హక్కులేదని, అంతకంటే మహా పాపం మరొకటి లేదని మదర్ బోధించేవారు. **(సశేషం)**

13

# తల్లిదండ్రులారా!

మీరు సాతాను ఏజెంట్లు అవునో కాదో మీ బిడ్డల పెంపకంలోనే తెలిసిపోతుంది. ఎందుకంటే 'మొక్కై వంగనిది మ్రానై వంగునా' అన్న సామెతను సాతాను బాగా పాటిస్తుంది. చిన్నప్పుడే పిల్లలను నాశనం చేయకపోతే, వారు పెరిగి పెద్దయ్యాక దేవున్ని తెలుసుకుంటే వారిని మార్చటం కష్టమని సాతానుకి బాగా తెలుసు అందుకే తల్లిదండ్రులను లక్ష్యము చేసుకొని వారి ద్వారా బిడ్డలను నాశనం చేస్తుంది. ఉదాహరణగా షద్రకు, మేషాకు, అబేద్నెగోలను తీసుకుంటే వారు దేవుని కోసం చనిపోవడానికి సిద్ధపడ్డారు. వారు చిన్నప్పటి నుండి దేవునియందు భయభక్తులతో పెరగ బట్టి రాజుకి, అగ్నిగుండానికి భయపడలేదు. సాతాను వారిని ఏమి చేయలేకపోయింది. దేవుని వాక్యమనే విత్తనము వారి హృదయములో నాటబడి, దాని వేరు హృదయపు లోతుల్లో స్థిరపడటం వలన సాతాను వారిని కదిలించలేక పోయింది. వాక్యము ఎంతో శక్తివంతమైనది. ఎంత శక్తివంత మైనదంటే '*దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది*" (హెబ్రీ. 4:12). ఇంతటి శక్తివంతమైన వాక్యాన్ని మీ పిల్లల హృదయములలో నాటినప్పుడు వారు ఆ వాక్యం వారితోపాటు పెరిగి పెద్దదై వారి హృదయాలలో స్థిరపడిపోతుంది. చిన్నపిల్లలు పరలోకరాజ్యాన్ని అంగీకరిస్తారని యేసుప్రభువు చెప్పాడు. "*చిన్న బిడ్డవలె దేవుని రాజ్యము అంగీకరింపనివాడు దానిలో ఎంతమాత్రమును ప్రవేశింపదని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను*" (లూకా 18:17). పిల్లల హృదయం దున్నబడిన భూమిలాంటిది. అలాంటి స్వచ్ఛమైన హృదయంలో మీరు మంచి నాటినా, చెడు నాటినా అవి త్వరగా ఫలిస్తాయి. కాబట్టి మీరు దేవుని వాక్యమును దున్నబడిన భూమిలాంటి మీ బిడ్డల హృదయంలో నాటినప్పుడు ఆ వాక్యము నూరంతలుగా ఫలిస్తుంది. అప్పుడు సాతాను మీ బిడ్డలను ఏమీ చేయలేదు. సాతాను మీ బిడ్డలను, మిమ్మల్ని రకరకాల ప్రలోభాలకు గురి చేస్తుంది. తల్లిదండ్రులకు విలాసవంతమైన జీవితాన్ని అలవాటు చేయడమో, కుదరదు అనుకుంటే తల్లిదండ్రుల మధ్య చిచ్చుపెట్టి వారిని విడదీయడమో చేసి ఆ ప్రభావం బిడ్డల మీద పడేలా చేస్తుంది. "*అవిశ్వాసియైన భర్త భార్యను బట్టి పరిశుద్ధపరచబడును; అవిశ్వాసురాలైన భార్య విశ్వాసియైన భర్తనుబట్టి పరిశుద్ధపరచబడును. లేనియెడల మీ పిల్లలు అపవిత్రులై యుందురు, ఇప్పుడైతే వారు పవిత్రులు*" (1కొరింథీ. 7:14). ఈ వాక్యప్రకారం చూస్తే భార్యాభర్తల్లో ఎవరో ఒకరు బిడ్డలకోసం తమ్మును తాము తగ్గించుకొని ఉండాలి. కుటుంబం విచ్ఛిన్నం అయితే బిడ్డలు అపవిత్రమైపోయి అసాంఘీక శక్తులుగా తయారవుతారు. ఈ రోజుల్లో బిడ్డలు చాలా చిన్నవయస్సులోనే అంటే యుక్తవయస్సులోకి అడుగు పెట్టకముందే పెద్ద పెద్ద తప్పులు చేస్తూ జైళ్ళకు వెళ్తున్నారు. క్రైస్తవ కుటుంబాలలో కూడా ఇలాంటి సంస్కృతి ఉంది. ఇదే సాతాను ప్రణాళిక. దీనినే కదా తల్లిదండ్రులు దిగ్విజయంగా నెరవేరుస్తూ సాతాను ఏజెంట్లుగా ఉంటున్నారు. సాతాను ప్రణాళిక ప్రకారం మీ బిడ్డలను పెంచకుండా, దేవునియందు భయభక్తులతో పెంచడం వలన మీ బిడ్డలపట్ల దేవుని ప్రణాళిక నెరవేర్చుటకు కృషి చేయండి.

**'గర్భఫలము దేవుడిచ్చు బహుమానము'**. దేవుడిచ్చే బహుమానం ఎప్పుడూ నాణ్యమైనదే. మీ బిడ్డలు దేవుని ప్రణాళికలో భాగంగా తల్లిగర్భములో ప్రవేశిస్తారని మీకు తెలుసా? తల్లిగర్భములోకి బిడ్డ ప్రవేశించడమనేది ఒక రహస్యమైన ప్రకియ. ఈ భూమి మీద ఉన్న ఏ టెక్నాలజీ దానిని కనిపెట్టలేదు. ఏవో కాకి లెక్కలు వేసి పలానా టైం అని చెప్తారు తప్ప బిడ్డ తల్లి గర్భములోకి ప్రవేశించిన సమయం దేవునికి తప్ప ఎవరికీ తెలియదు. దేవునికి మాత్రమే తెలుసు అంటే అది దేవుని ప్రణాళిక కాక ఇంకేమవుతుంది. ఈ ప్రక్రియ గురించి, దేవుని ప్రణాళిక గురించి తలిదండ్రులు ఆలోచించగలిగితే దేవుడంటే భయము ఏర్పడుతుంది. దావీదు తన పుట్టుక గురించి ఆలోచించి "*నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి అందునుబట్టి నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను నీ కార్యములు ఆశ్చర్యకరములు. ఆ సంగతి నాకు బాగుగా*

తెలిసియున్నది" (కీర్తనలు 139:14) అని వ్రాశాడు. మీరు కూడా బిడ్డ తల్లి గర్భములో ఎలా పెరుగుతుందో ఒకసారి ఆలోచించండి. తొమ్మిది నెలలపాటు గాఢాంధకారములో పెరుగుతారు. కంటికి కనిపించని ఒక చిన్నకణము పెరిగి పెద్దదవుతూ కళ్ళు, చెవులు, ముక్కు, నోరు, కాళ్ళు, చేతులు, శరీర భాగాలు ఏర్పడి పరిపూర్ణమైన తరువాత, తల్లి గర్భము నుండి బయటకు పంపబడుతుంది. ఇదంతా దేవుడు చేసే ప్రక్రియ. *"నేను పిండమునై యుండగా నీ కన్నులు నన్ను చూచెను"* (కీర్తనలు 139:16) అని వ్రాసిన దావీదుకి ఆ విషయం ఎలా తెలుసు? ఆయన తన పుట్టుక గురించి లోతుగా ఆలోచించాడు. మీ బిడ్డ గురించి దావీదులా ఆలోచించి చూడండి. గర్భంలో ఉన్నప్పుడు దేవుడు మీ బిడ్డని చూస్తున్నాడంటే ఆయన ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్నా డని అర్థం. మీ బిడ్డలు పరిపూర్ణ ఆరోగ్యంతో పుట్టిన తర్వాత ఆ బిడ్డలను చూసి మురుసుకుంటారు కదా. ఒకవేళ ఎవరి కైనా అనారోగ్యంతోనో, అంగవైకల్యంతోనో బిడ్డలుపుడితే వారు ఎంత బాధపడతారు, ఏడ్చుకుంటారు. దేవుడు అలా ఎందుకు చేస్తాడు అని అంటారా? *"మానవునకు నోరిచ్చిన వాడు ఎవడు? మూగ వానినేగాని చెవిటివానినేగాని దృష్టిగలవానినేగాని గ్రుడ్డి వానినేగాని పుట్టించిన వాడెవడు? యెహోవానైన నేనే గదా"* (నిర్గమ. 4:11). ఈ వాక్యప్రకారం చూస్తే మీ బిడ్డలను పరిపూర్ణంగా పుట్టించినట్లే కదా. మీకు పరిపూర్ణమైన బిడ్డను ఇచ్చినందుకు దేవునికి కృతజ్ఞత కలిగి ఆ బిడ్డని దేవునిలో పెంచితే మీరు బాధ్యత నెరవేర్చిన వారవు తారు. అనారోగ్యంతో పుట్టిన బిడ్డలని దేవుని సన్నిధిలో పెట్టి 'దేవా, ఈ బిడ్డకి స్వస్థత అనుగ్రహిస్తే నీ సేవకు వాడ తాము' అని దేవునితో ఒడంబడిక చేసుకొనేవారు ఉంటారు. దేవుడు మీ బిడ్డలను పరిపూర్ణ ఆరోగ్యంతో, తెలివితేటలతో పుట్టించినందుకు మీ బిడ్డలను దేవుని సేవ కొరకు సమర్పించుకోకపోయినా పరవాలేదు కాని, దేవునియందు భయభక్తులతో పెంచండి. మీ బిడ్డలను దేవునియందు భయభక్తులతో పెంచడమంటే వారిని దేవుని చేతుల్లో పెట్టడమే. మీ బిడ్డలు దేవునిచేతుల్లో ఉండటం కంటే సురక్షితం ఇంకేముంటుంది. మీ బిడ్డలు పెరిగి పెద్దయ్యాక ఏం చేస్తున్నా దేవుని కాపుదలలోనే ఉంటారు. దేవుడు ఆయన దూతలను మీ బిడ్డలకు కాపలాగా ఉంచు తాడు. మీ బిడ్డల ఆధ్యాత్మిక స్థితి పట్ల శ్రద్ధ వహించండి. **(సశేషం)**

**(11వ పేజీ తరువాయి...)**

తీసిన రిపోర్టులో మీ శరీరంలో ఏ జబ్బు కనిపించటం లేదు. చాలా ఆశ్చర్యంగా వుంది. అందుకే మిమ్మల్ని నాలుగు గంటల పాటు రకరకాల పరీక్షలు చేశాము. మీ తల వెంట్రుకల నుండి పాదాల వరకు రకరకాల పరీక్షలు చేసినా మీ శరీరంలో ఈ జబ్బేకాదు, ఏ రకమైన జబ్బూ లేదు. మీ కడుపు నిండా నీరు వుంది. రెండు రకాల మాత్రలు వ్రాశాను, 21 రోజులపాటు వాడితే కడుపు మామూలు స్థితికి వస్తుంది' అన్నాడు. '21 రోజుల తర్వాత మరలా ఇక్కడికి రావాలా?' అని అడిగాను. 'నీకు అసలు ఏ జబ్బు లేనప్పుడు ఎందుకు రావడం. నువ్వు మరలా ఇక్కడికి రావలసిన అవసరం లేదు' అన్నాడు. 'పథ్యం ఏమిటి?' అని అడిగాను. 'నీ ఒంట్లో నెత్తురు లేదు. నీకేది ఇష్టమైతే అది తిను కాని ఉప్పు తక్కువగా తీసుకో' అన్నాడు.

ఒంగోలు వచ్చిన తర్వాత డాక్టరుగారు చెప్పినట్లుగానే అన్నీ రకాలైన భోజనాలు, మాంసం, చేపలు ఎక్కువగా తినటం ప్రారంభించాను. డాక్టరుగారు చెప్పినట్లుగానే నా కడుపు సాఫీగా అయ్యింది. ఒక నెల తర్వాత చర్చిలో బుధవారం సాయంకాలం వాక్యం చెప్తూ ఎడమ చేయి మణికట్టు దగ్గర గీరితే రక్తం వచ్చింది. మరుసటి రోజు గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్ళి చెప్పాను. మీకు ఏ జబ్బూ లేదు, శరీరంలో రక్తం ఎక్కువ అయింది అన్నాడు డాక్టరు. ఏం చెయ్యమంటారు అని అడిగాను. రక్తదానం చెయ్యమని సలహా ఇచ్చాడు డాక్టరు. నా రక్తం పనికివస్తుందా? నాకు ఐదు నెలల క్రితం పసికర్లు అయ్యాయి అన్నాను. ఆయన నాకు రక్త పరీక్ష చేసి, మీకు అసలు ఎప్పుడూ పసికర్లు రాలేదు, నీకు బి.పి. కానీ, షుగరు కానీ లేవు అన్నాడు. వెంటనే నేను ఒక బాటిల్ రక్తం దానం చేశాను. 6 నెలల తర్వాత మరలా రక్తదానం చేశాను.

ఒక్క సామ్యేలు రాజేంద్ర చనిపోతే దేవునికేమీ కొదువ కాదు. వందమందిని ఒక్కక్షణంలో ఆయన లేపగలడు. కాని నశించిపోతున్న ఒక పాపినైన నా కొరకు ఆయన ప్రణాళికతో అమెరికా నుండి వచ్చిన జానెట్ అనే ఆమెను సాక్షిగా పెట్టి, 2000 సంవత్సరాల క్రితం (మార్కు సువార్త 1వ అధ్యాయం 29వ వచనము ప్రకారం) జరిగిన సంఘటనలోనికి నన్ను తీసుకొని వెళ్ళాల్సిన అవసరం దేవదేవునికి ఏమీ లేదు.

దేవుని ప్రేమ అనేది మానవ మాత్రులకు వివరించ అసాధ్యము. ఎవరికి వారు అనుభవములో మాత్రమే తెలుసుకొనగలిగినది.

# తరతరములకు దేవుడు ఆయనే

ప్రియమైన హన్నాకృప ప్రేక్షకులకు నా శుభములు.

యెహోవా దయగలవాడు, ఆయన కృప నిత్యముండును. ఆయన సత్యము తరతరములుండును. (కీర్తనలు 100:5) దేవుడు మనుష్యులను వ్యక్తులుగా మాత్రమే కాకుండా, తర తరాలుగా చూస్తాడు. బైబిలు అంతటా దేవుని ప్రేమ, కృప, నిబంధన మరియు విశ్వాసం ఒక తరం నుండి మరొక తరానికి కొనసాగుతున్నట్లు మనం గమనిస్తాము . అందుకే కీర్తనాకారుడు ఇలా రాశాడు. కాలాలు మారినా, మనుష్యులు మారినా, దేవుని స్వభావం మారదు. ఆయన వాగ్దానాలు ఒక తరానికే పరిమితం కావు. అవి తరతరాలకు వర్తిస్తాయి. అందుకే ప్రతి విశ్వాసి తన జీవితంలో దేవుని అనుభవాన్ని తదుపరి తరానికి అందించడం వారి బాధ్యత. “యెహోవా స్తోత్రార్హ క్రియలను ఆయన బలమును ఆయన చేసిన ఆశ్చర్య క్రియలను దాచకుండ, (రాగల తరములలో) పుట్టబోవు పిల్లలు దాని నెరుగునట్లును, వాటిని వారి పిల్లలకు మేము చెప్పెదము” (కీర్తనలు 78:4). ఇలా చెప్పడం ద్వారా వారి పిల్లలు దేవునియందు నిరీక్షణ గలవారై, దేవుని క్రియలను మరువక, యథార్థ హృదయంతో దేవుని విషయమై స్థిరమనస్సు గలవారై ఆయన ఆజ్ఞలను గైకొందురు.” ఈ సంగతి మీ బిడ్డలకు తెలియజేయుడి. వారు తమ బిడ్డలకును ఆ బిడ్డలు రాబోవు తరము వారికిని తెలియజేయుదురు” (యోవేలు 1:3). తిమోతి గురించి పౌలు ఈ విధంగా చెప్పాడు. నీయందు నిష్కపటమైన విశ్వాసమును జ్ఞాపకము చేసుకొని, ఆ విశ్వాసము మొదట నీ అవ్వయైన లోయిలోను నీ తల్లియైన యునీకేలోను వసించెను, అది నీయందు సహ వసించుచున్నదని నేను రూఢిగా నమ్ముచున్నాను (2తిమోతి 1:5). ఇక్కడ విశ్వాసం తరువాత తరాలకు అందించబడింది. మన ఆస్తులు, సంపద, గొప్పపేరు, విజయాలు కాలంతో కనుమరుగవుతాయి. కానీ దేవుని మీద ఉన్న విశ్వాసం, ప్రార్థన జీవితం, పరిశుద్ధమైన నడవడి మరియు దేవుని వాక్యంపై ప్రేమ తరతరాలకు నిలిచే వారసత్వం. “ఆ తరమువారందరు తమ పితరుల యొద్దకు చేర్చబడిరి. వారి తరువాత యెహోవానైనను ఆయన ఇశ్రాయేలీయుల కొరకు చేసిన కార్యములనైనను ఎరుగని తరమొకటి పుట్టగా” (న్యాయాధిపతులు 2: 10). యెహోషువ మరణం తరువాత ఆ వచ్చిన ఈ తరం . దేవుని గురించి వినలేదు కాదు కానీ ఆయనలో వ్యక్తిగత సంబంధ కరిగి ఉండలేదు. దేవుని మనస్సును తెలుసుకోలేకపోయారు.

ఫలితంగా వారు విగ్రహారాధనలో పడిపోయారు. ఇది నేటి తరానికి సంఘానికి కూడా హెచ్చరిక. ఏలీ కుమారులు, సమూయేలు కుమారులు అలాగే దేవుని వెంబడించక, ఆయన మాట గ్రహించక పడిపోయారు. దేవునికి కావలసింది ఆయన్ని వెదికే తరం. “ఒకని సంతతి వారు ఆయనను సేవించెదరు రాబోవు తరమునకు ప్రభువును గూర్చి వివరింతురు” (కీర్తనలు 22:30 దేవుడు ప్రతి తరంలో తనను మహిమపరచే ప్రజలను వెదుకుతున్నాడు. నీతో నిత్య నిబంధన చేసుకోవాలని ఆశపడుతున్నాడు. “నేను వారితో చేయు నిబంధన ఇదే –నీ మీదనున్న నా ఆత్మను నేను నీ నోటనుంచిన మాటలను నీ నోటనుండియు నీ పిల్లల నోటనుండియు నీ పిల్లల పిల్లల నోటనుండియు ఈ కాలము మొదలుకొని యెల్లప్పుడును తొలగిపోవు” అని (యెషయా 59:21). యెహోవా సెలవిచ్చుచున్నాడు. ఎందుకంటే “ఆయన విశ్వాస్యత తరతరములందును” (కీర్తనలు 119:90). “తన్ను ప్రేమించి తన ఆజ్ఞల నను సరించి నడుచుకొనువారికి తన నిబంధన స్థిరపరచువాడును వేయితరములకు కృపచూపువాడును నమ్మదగిన దేవుడును” (ద్వితీయో. 7:9). కాబట్టి ప్రభువా మా తరము నిన్ను తెలిసికొని, నిన్ను సేవించి, మా తరువాతి తరాలకు నీ సత్యాన్ని వివరించే విశ్వాసాన్ని అందించే కృపను మాకు అందరికి అనుగ్రహింపుము తండ్రీ, ఆమేన్.

–ఇట్లు, **డా॥ సుష్మ ప్రశాంత్, నెల్లూరు**

స్త్రీల విభాగం

# నా కుటుంబము

**భార్య, భర్త, పిల్లలు కలిసి ఒకే చోట ఉంటే దానిని కుటుంబము అంటారు. పిల్లలు ఉన్నా లేకపోయినా భార్యా భర్తలు కలిసి జీవిస్తున్నా కుటుంబమనే అంటారు. కుటుంబ వ్యవస్థ అనేది దేవుని ప్రణాళికలో భాగమే. కుటుంబ వ్యవస్థలో స్త్రీ ప్రధాన భూమిక పోషిస్తుంది.**

---

దేవుడు యాకోబుతో నీవు లేచి బేతేలుకు వెళ్ళి అక్కడ నివశించి నీ సహోదరుడైన ఏశావు యెదుట నుండి నీవు పారిపోయినప్పుడు నీకు కనబడిన దేవునికి అక్కడ బలి పీఠము కట్టుమని చెప్పెను. దేవునితో మాట్లాడిన తరువాతనే లేక దేవుని తోటి ధైర్యంగా, అనగా పూర్వం తన మామతో రాళ్ళు కూర్చుడని చెప్పినంత గంభీరముగా తన ఇంటివారితో తన యొద్దనున్న వారందరితో (అనగా తన కుమారులు చెరగొని తెచ్చిన అన్యస్త్రీలు, పిల్లలతోను) మీ యొద్దనున్న అన్యదేవతలను పారవేసి మిమ్ములను మీరు శుద్ధిపరుచుకొని మీ వస్త్రములను మార్చుకొనుడి అన్నాడు.

అదే విధంగా లోతు సొదొమ దగ్గరకు తన కుటుంబాన్ని నడిపించాడు. దాని పర్యావసానం మనకు తెలుసు. మన ఇరుగుపొరుగు ఎంత బీదలైన సరే, వారు దేవుని భయం కలిగిన వారై ఉండాలి. దేవుని భయంలేని ప్రాంతాలలో మనం కాపురం ఉండకూడదు. లోకమందుండు కుటుంబా లలో సైన్యములకు అధిపతియగు యెహోవా యను రాజునకు మ్రొక్కుటకై యెరూషలేమునకు రాని వారందరి మీద వర్షము కురియకుండును అని జకర్యా 14:17లో ప్రభువు సెలవిచ్చాడు. నిజ దేవుని ఎరుగని వారిని కూడా కుటుంబాలతో దేవుని పూజించుటకు రమ్మని, ఐగుప్తీయుల కుటుంబాల వారు బయలుదేరకయు, రాకయుండిన యెడల వారికి కూడా వర్షము లేకపోవును అని సెలవిస్తున్నాడు.

ప్రవక్తయైన సమూయేలు తల్లిదండ్రులు ఈలోకములో యేసుప్రభువు తల్లి దండ్రులు అని పిలువబడిన మరియ, యోసేపులు కూడా కుటుంబ సమేతంగా దేవుని ఆరాధించు టకు వెళ్ళుచుండిరి. సమరయ స్త్రీతో మాట్లాడేటప్పుడు జీవ జలమును ఆమె అడిగినప్పుడు ఆయన ఆమె కుటుంబ మును ప్రస్తావించాడు.

యెరికో పట్టణంలో సంచరిస్తూ చెట్టు మీదనున్న జక్కయ్యను రక్షించటానికి ముందు యేసు జక్కయ్య కుటుంబమునకు వెళ్ళవలసియున్నదని చెప్పాడు. దేవుడు కుటుంబమును ఒక యూనిట్‌గా చూస్తున్నాడు.


"నీవును నీ యింటివారును రక్షింపబడుదురు" అనిన వాగ్దానము మనకున్నది. చాలామంది ఈ వాగ్దానమును గురించి ఆలోచించరు. ఆ వాగ్దానాన్ని అర్థించరు. నేటి ప్రపంచ పరిస్థితులలో ఒక దంపతుల కుటుంబము యొక్క కాలమానమును కేవలం పదిహేను లేక పద్దెనిమిది యేండ్లు మాత్రమే! ఎందుకంటే భార్యభర్తలు ఒకటై తల్లిదండ్రుల నుండి వేరై తమకు పిల్లలు పుట్టిన తర్వాత పెద్ద బిడ్డ చదువుకొరకు, తరువాత సంపాదన కొరకు ఇంటి నుండి (కుటుంబము) వెళ్ళిపోతారు కాబట్టి, మానవులకు ఇవ్వబడిన జీవితకాలంలో కుటుంబము యొక్క కాలపరిమితి ఇన్ని సంవత్సరాలే! కనుక ఈ సంవత్సారాల పరిమితిలో మానవునికి దేవుడు సంపూర్ణ సంతోషం కొరకు ఇచ్చిన కుటుంబంతో ఎక్కువకాలం గడపాలి.

నాకు తెలిసిన కుటుంబాలు ఎక్కువశాతం మంది చదువు పేరుతో, సంపాదనా వ్యామోహంతో దేవుడిచ్చిన కుటుంబ సంతోషములో పదవవంతు కూడా అను భవించటం లేదు. దేవుడిచ్చిన మన కుటుంబము ద్వారా వచ్చే సంతోషాన్ని మననీతితో, మన తెలివితేటలతో దూరం చేసుకొని స్వాభావికమైన సంతోషమునకు బదులుగా అస్వాభావికమైన దారులలో ఆ సంతోషాన్ని వదలి దుఃఖ పూరితమైన ముగింపులో ఉన్నారు.

**(సశేషం)**

## ఈ నెల ప్రశ్న - జూలై-2026

**ఏ రాజు యేలుబడిలో ఎజ్రా బబులోను నుండి యెరూషలేము పట్టణమునకు వచ్చెను? (ఎజ్రా)**




మీ జవాబు (రెఫరెన్సుతో సహా) ఈ నెల 15వ తేదీలోపు 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా మాత్రమే పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో **'లక్కిడిప్'** ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ. 250/-లు విలువ చేసే **'అపొస్తలుడు'** అనే పుస్తకం బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం కేవలం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు (చందాదారుల పట్టికలో పేరు ఉన్నవారు) ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 15వ తేది లోపు చందా చెల్లించేవారు కూడా పాల్గొనవచ్చును. ఈ క్రింది బాక్సులో జవాబు, మీ పేరు, బుక్ సీరియల్ నంబరు వేసి ఫోటో తీసి వాట్సాప్ ద్వారా పంపించాలి. పేరు, సీరియల్ నంబరు లేకపోతే వారి పేరు లక్కిడిప్‌లో చేర్చబడదు.

జవాబు..........................................................

పేరు..............................................................

గ్రామము................బుక్ సీరియల్ నంబరు...........

**జూన్-2026 ప్రశ్న జవాబు :**
**లహ్మీ (2దినవృత్తాంతములు 20:5)**
(జవాబు మరియు రెఫరెన్సు తప్పని సరిగా వ్రాయాలి)

**జవాబులు పంపినవారు :**
1. టి. క్రిస్టియానమ్మ- నందికొట్కూరు, 2. వై.సంధ్యారాణి -ఒంగోలు, 3. బి. నెహెమ్యా-చిన్నగంజాం, 4. బి. సరోజిని-గుంతకల్లు, 5. మేరిపవిత్ర-మంచిర్యాల, 6. ఆర్. జయమ్మలాబాను-గుంతకల్లు, 7. సి.హెచ్. జయకర్-శ్రీకాళహస్తి, 8. కె.ఉదయకుమారి-కాకుమాను, 9. సి.హెచ్. దయరాజు-రామానుజపురం,

## చందాదారుల వివరములు

| | | |
|---|---|---|
| **డా॥ సిహెచ్‌కె. సుష్మప్రశాంత్, నెల్లూరు** | **(23-05-26)** | **15000** |
| **పి.వి.కెరోలిన్, గుంటూరు** | **(12-12-25)** | **10000** |
| ఈ.సి.సుగుణమ్మ, పులివెందుల | (26-12-25) | 5000 |
| యు. అనిత, సిరివెళ్ళ | (09-12-25) | 5000 |
| డా॥ బి. ప్రజ్వలిత్ రూబేన్, హన్మకొండ | (12-10-24) | 5000 |
| రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి | (15-01-24) | 5000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (21-06-24) | 5000 |
| మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా | (29-11-22) | 5000 |
| డా॥ క్రిస్టియన్ సిరప్ప, అనంతపూర్ | (23-01-26) | 3000 |
| బి. ప్రభువరకుమార్, రామన్నపేట | (24-06-25) | 3000 |
| కె. రజిని, నరసరావుపేట | (15-06-25) | 3000 |
| బి. రవికుమార్, హైదరాబాద్ | (26-11-25) | 2000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (22-08-25) | 2000 |
| పి. జయదేవి, గుంటూరు | (03-07-25) | 2000 |
| వై. సంధ్యారాణి, ఒంగోలు | (04-01-25) | 2000 |
| ఆర్.ఆర్.కె.పీటర్, విశాఖపట్నం | (07-07-26) | 1000 |
| శ్రీమతి రూతు హోసన్న, కావలి | (19-04-26) | 1000 |
| కొడవటికంటి అశోక్‌కుమార్, ఒంగోలు | (09-08-25) | 1000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (27-03-25) | 1000 |
| జి. కమలాకర్, ఒంగోలు | (03-03-25) | 1000 |
| జి.మాణిక్యమ్మ, అనంతపురం | (25-03-24) | 1000 |
| డి. ప్రభావతి, కొడవకల్లు, కృష్ణాజిల్లా | (12-12-25) | 800 |
| వి. కస్తూరిఆగస్టీన్, భీమవరం | (07-05-26) | 600 |
| సి.హెచ్. జయకర్, శ్రీకాళహస్తి | (12-06-26) | 500 |
| కె. కమల్, మంచిర్యాల, తెలంగాణ | (14-05-26) | 500 |
| బి. సరోజిని, గుంతకల్లు | (05-05-26) | 500 |
| టి. కళావతిజాకబ్, ఒంగోలు | (14-04-26) | 500 |
| టి. ప్రేమ్‌చంద్రరావు, ఒంగోలు | (14-04-26) | 500 |
| యస్. గోపి, సుడిగాం, విజయనగరం | (11-04-26) | 500 |
| బి. జయరావు, నెల్లూరు | (10-04-26) | 500 |
| జి. జార్జిథామస్, దుగ్గిరాల | (07-04-26) | 500 |
| బి. నెహెమ్యా, చిన్నగంజాం | (07-01-26) | 500 |
| పి. దేవదానం, గుంటూరు | (17-10-25) | 500 |
| యం. విల్సన్ సామ్యేల్, నెల్లూరు | (08-09-25) | 500 |
| డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల | (04-09-25) | 500 |
| ఆర్. జయమ్మలాబాను, గుంతకల్లు | (16-07-25) | 500 |
| యం. స్వయంప్రభ, చిలకలూరిపేట | (10-06-26) | 350 |
| కె. ఉదయకుమారి-కాకుమాను | (09-06-26) | 350 |
| టి. జోయల్‌రాజు, భీమిలి | (11-03-26) | 350 |
| కె. స్వప్నిక, మార్కాపురం | (20-02-26) | 350 |
| జి. హనోక్, తూర్పుగంగవరం | (12-02-26) | 350 |
| జి. మేరిక్యాథరిన్, ఒంగోలు | (11-02-26) | 350 |
| డి. శామ్యూల్ డేవిడ్, దేవరపల్లి | (04-02-26) | 350 |
| డి. నాగేశ్వరరావు, సంతరావూరు | (31-01-26) | 350 |
| కె. ప్రభాకర్, వెంకటగిరి | (06-01-26) | 350 |
| సిహెచ్. దయరాజు, రామానుజపురం | (05-11-25) | 350 |
| కె. మార్టిన్‌మధుచరణ్, పులివెందుల | (18-10-25) | 350 |
| టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు | (08-09-25) | 350 |
| పి. స్వప్న, పాల్వంచ | (09-08-25) | 350 |
| మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ | (06-08-25) | 350 |
| జి. ఏంజల్ పౌలాస్- ఒంగోలు | (02-08-25) | 350 |

చిన్నపిల్లల పేజి

# సాతాను వల

ఒకరోజు సాయంత్రం ట్యూషన్‌కి అని బయల్దేరిన సన్నికిదారిలో జనం గుంపుకూడి ఉండడం కనబడింది. అనాలోచితంగానే ఆవైపుగా కదిలాడు. జనాల గుంపు మధ్యలో ఒక వ్యక్తి నిలబడి ఏదో చెప్తూ ఒక ఖాళీ బుట్టలో నుండి పావురాన్ని తీశాడు. ఎంత ఆశ్చర్యమో కదా! చుట్టూ ఉన్న జనాలు చప్పట్లు చరిచారు. పెద్దవాళ్ళు అందరు వారికి తోచినంత డబ్బులు ఇచ్చారు. పిల్లలు, పెద్దలు కళ్ళ ముందు కనబడుతున్న వింతను ఆశ్వాదిస్తున్నారు. సన్ని కూడా అక్కడే నిలబడిపోయాడు. ఆ ప్రదర్శన అయి పోయిన తరువాతగానే సన్ని ఈ లోకంలోకి రాలేదు. తీరా చూస్తే చీకటి పడిపోయింది. ట్యూషన్‌కి వెళ్ళవలసిన టైమ్ కాదు, ట్యూషన్ అయిపోయే టైమ్ అయ్యిందని గ్రహించిన సన్ని ఇంటి దారి పట్టాడు. తను ట్యూషన్‌కి వెళ్ళకుండా రోడ్డు మీదగారడీ చూస్తూ ఉన్నాను అని తెలిస్తే అమ్మ ఖచ్చితంగా కోప్పడుతుది కాబట్టి ట్యూషన్‌కి వెళ్ళలేదు అనే విషయం అమ్మకు తెలియకుండా జాగ్రత్త పడితే సరిపోతుంది. అయినా తను చెప్పక పోతే అమ్మకి ఎలా తెలుస్తుంది? అని ఆలోచించుకొని ఇంటికి వెళ్ళాడు.

ట్యూషన్‌కి వెళ్ళలేదని అమ్మ కనిపెట్టేస్తదేమో అని భయపడినా తరువాత తమాయించుకొని చిన్నగా ఇంట్లోకి అడుగుపెట్టాడు సన్ని. సాధ్యమైనంత వరకు అమ్మ కంట్లో పడకుండా తప్పించుకుని తిరిగాడు. తను ట్యూషన్‌కి దుమ్మా కొట్టిన విషయం అమ్మ కనిపెట్టనందుకు సంతోషించడమే కాక తన తెలివితేటలపై లోలోపల అతిశయించాడు సన్ని.

నిద్రకు ఉపక్రమించే సమయంలో రేపటి నుండి దారిలో ఎక్కడ ఆగకుండా ట్యూషన్‌కి వెళ్ళాలి అనుకునేంతలో అకస్మాత్తుగా ట్యూషన్ ఫీజు కట్టమని తల్లి తనకు ఇచ్చిన డబ్బులు గుర్తుకు వచ్చాయి. గబగబ జేబులు తడివి చూశాడు డబ్బులు లేవు. కంగారుగా స్కూల్ బ్యాగ్ అంతా వెతికి చూశాడు ఎంత వెతికినా డబ్బులు మాత్రం దొరకలేదు.

నిజానికి సన్ని గారడీ చూడడం కోసం నిలబడినప్పుడు ఆ గుంపులో ఉన్న జేబు దొంగలు సన్ని జేబును ఖాళీ చేశారు. సన్నికి చాలా భయమేస్తుంది. ఏమి చేయాలో అర్థం కాలేదు. రేపు ట్యూషన్ ఫీజు కట్టలేదని అమ్మకి తెలిస్తే... భయంతో చెమటలు పట్టాయి. చాలాసేపు ఆలోచించిన మీదట సన్నికి డాడీ జేబులో నుండి డబ్బులు కొట్టేయడం ఒక్కటే మార్గం అనిపించింది. కానీ ఎలా? డాడీకి తెలిస్తే చంపేస్తారు....ఎలా అని ఆలోచనలో పడ్డాడు. అందరూ నిద్రపోయాక డాడీ ప్యాంట్ జేబులోని డబ్బులు కొట్టేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ రాత్రంతా సన్నికి నిద్రపట్టలేదు. మొత్తానికి సన్ని డాడీ జేబు నుండి ట్యూషన్ ఫీజును దొంగలించి జాగ్రత్తగా తన సైన్స్ నోట్స్‌లో దాచిపెట్టాడు.

మరునాడు తండ్రికి ఎదురుపడకుండా సాధ్యమైనంత త్వరగా స్కూల్‌కి బయల్దేరిపోయాడు. ఎప్పుడెప్పుడు స్కూల్ అయిపోతుందా, ఎప్పుడెప్పుడు ట్యూషన్‌కి వెళ్ళి ఫీజు కట్టాలి అని అనుకుంటూ స్కూల్ చేరుకున్నాడు సన్ని.

సాయంత్రం స్కూల్ నుండి రాగానే త్వరత్వరగా రెడీ అయ్యి ట్యూషన్‌కి బయల్దేరాడు సన్ని. దారిలో ఎక్కడా ఆగ కుండా ట్యూషన్ చేరుకున్నాడు. ఫీజు కడదామని సైన్స్‌బుక్ తీయబోయాడు. బుక్ కనపడలేదు. కంగారుగా బుక్ వెదకసాగాడు. అప్పుడు గానీ గుర్తులేదు. సైన్స్ అసైన్‌మెంట్ నోట్స్ స్కూల్‌లో టీచర్‌కి సబ్మిట్ చేసి వచ్చాడని గుర్తు వచ్చి నాలుక కరుచుకున్నాడు. ఎంతో కష్టపడి డబ్బులు కొట్టేసినా సమస్య తీరలేదు. ఇప్పుడెలా? సైన్స్ నోట్సులో డబ్బులు ఉన్నాయో లేవో? ఎవరైనా దొంగలించారేమో. ఎక్కడైనా కింద పడిపోయాయేమో. ఎందుకైనా మంచిది నాన్న దగ్గర్నుండి డబ్బులు కొట్టేస్తే... ఒకవేళ స్కూల్ బుక్‌లో మనీ ఉంటే అవి తిరిగి డాడీ జేబులో పెట్టేస్తాను అని తీర్మానించు కున్నాడు. ట్యూషన్ నుండి ఇంటికి వచ్చిన సన్నికి డాడీ జేబులో తగ్గిన డబ్బులను గూర్చి తల్లిదండ్రులు మాట్లాడు కోవడం వినపడింది. దాంతో తండ్రి జేబులో నుండి డబ్బులు కొట్టేయాలనే తన ప్రయత్నం మానుకొని తల్లి వంటగదిలో పోపుల డబ్బాలో పెట్టే డబ్బులు కొట్టేయాలని నిర్ణాయానికి వచ్చాడు. అందరూ నిద్రపోయాక మెల్లగా వంట గదిలోకి వెళ్ళి పోపుల డబ్బా వెతకసాగాడు. అది ఎప్పుడూ ఉండే అలమరలో కాక పై అల్మరలో ఉంది. ఎంత ప్రయత్నించినా సన్నికి అది అందడంలేదు. చివరికి స్టూల్ సహాయంతో డబ్బాని అందుకున్నాడు. ఎంత ప్రయత్నించినా డబ్బా మూత

రాలేదు. విసిగి బలంగా లాగడంతో అది సన్ని చేతిలో నుండి క్రిందపడి పెద్దగా మ్రోగింది. వంటగదిలో లైట్‌లు వెలిగాయి. తల్లిదండ్రుల ముందు దొంగతనం చేస్తూ అడ్డంగా దొరికిపోయిన సన్ని. చివరికి కథ మొత్తం చెప్పాల్సి వచ్చింది సన్నికి. తండ్రి తనను శిక్షిస్తాడని తెలుసు. అంతేకాదు తాను చేసింది తప్పు అని తెలుసు. అందుకే దెబ్బలు తినడానికి సిద్ధపడి తండ్రి ముందు నిలబడ్డాడు.

తండ్రి సన్నిని శిక్షించక తన దగ్గర కూర్చోబెట్టుకొని ఇలా అన్నాడు. చూడు సన్ని నువ్వు దారి తప్పి సాతాను ఎరగా వేసిన గారడీని చూడాలనుకోవడంతో సాతాను వలలో పడిపోయావు. ఫలితంగా ట్యూషన్‌కి వెళ్ళలేదు. అది మొదటి తప్పు. దానిని మా ముందు ఒప్పుకోక దాచిపెట్టాల నుకున్నావు ఇది రెండో తప్పు. అది ఆ తప్పిదంతోపోలేదు. దాని కారణంగా డబ్బులు నష్టపోయావు. అప్పుడైనా అమ్మతో కానీ నాతో కానీ నీవు చెప్పలేదు. ఫలితంగా దొంగతనం చేయాల్సి వచ్చింది. అప్పుడైనా సమస్య తీరిందా? లేదు పైగా నువ్వు మళ్ళీ దొంగతనం చేయాల్సి వచ్చింది. ఇప్పుడు నువ్వు మాకిలా దొరకకపోతే మరలా దొంగతనం చేస్తావు అనడంలో ఎలాంటి సందేహం లేదు. పాపము (తప్పు) అనేది చేయనేకూడదు. పొరపాటున చేస్తే వెనువెంటనే దానిని ఒప్పుకొని విడిచిపెట్టాలి లేకుంటే సాతాను వేసే వలలో చిక్కుకుంటాం. ఎప్పటికి ఆ వల నుండి బయటపడలేము. ట్యూషన్‌కి వెళ్ళలేదని మాకు తెలియకుండా దాచాలి అంతే చాలు అనుకున్నావ్ కానీ అది దొంగతనం చేయడానికి దారితీస్తుందని నీక్కూడా తెలియదు కానీ చేయాల్సి వచ్చింది. ఏ రూపంలో అయినా, ఎంత చిన్నదైనా పాపానికి మన జీవితంలో చోటిస్తే అది మన జీవితాన్ని నాశనం చేసి పాపానికి దాసులుగా చేస్తుంది. కాబట్టి మరెన్నడు నీవు ఇలాంటి తప్పు చేయకు అన్నాడు. సన్ని సరే అన్నట్లు తలూపాడు ఏడుస్తూనే.

ఆదివారం ఆరాధన అనంతరం సన్నివాళ్ళ డాడీ సన్నిని దగ్గరలో ఉన్న చిన్న చెరువు వద్దకు ఫిషింగ్‌కి తీసుకెళ్ళాడు. సన్ని చాలా ఆసక్తిగా తండ్రిని గమనిస్తున్నాడు. తండ్రి ఫిషింగ్ రాడ్ చివరన మాంసాన్ని పెట్టడం గమనించిన సన్ని అది ఏమిటన్నట్లు చూస్తున్నాడు. అది గమనించిన తండ్రి సన్నితో – చేపలు ఫిషింగ్‌రాడ్ వద్దకు వచ్చునట్లు ఆకర్షించుటకు చిన్న మాంసపు ముక్కలను పెడుతున్నాను. ఎర (మాంసం) తినడానికి వచ్చిన చేపకు ఫిషింగ్ రాడ్, దానికున్న కొక్కెం కనపడదు, ఎర మాత్రమే కనపడుతుంది. అర్థమైందా అన్నాడు సన్నిని చూస్తూ. అర్థమైందన్నట్లు తలూపాడు సన్ని. కాబట్టి పిల్లలు సమస్య ఎటువంటిదైనా సరే దేవుని ముందు ఒప్పుకొని తల్లిదండ్రులకు చెప్పడం, వారి గద్దింపును, శిక్షను భరించడానికి సిద్ధపడితే, సాతాను ఉచ్చులో పడకుండా జీవితం క్షేమకరమైన దేవుని కాపుదలలోకి వెళ్తుంది. ***'నిబ్బరమైన బుద్ధిగలవారమై మెలకువగా ఉండుడి మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు" 1పేతురు 5:8***

## బైబిల్ పద వినోదము-18 జవాబులు

### పెద్ద ప్రవక్తలు

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఆ | పే | లు | మే | న | హ | రు | పె | ట్టి | సా | ని | ము | మ | క్షా | క్రీ |
| లో | ప | ఘూ | రు | చి | శే | యీ | రు | ఫ | లి | రె | ఉ | పి | డు | న్ను |
| చ | అ | న | ఇ | టు | బా | గు | రు | తి | రో | శ్రా | పా | జీ | యే | బా |
| న | నా | ఘూ | డ | తె | కో | వా | వు | దే | లు | నె | జు | గ | వం | రూ |
| క | తో | ర్ఖ | షె | నై | న | బు | రీ | న్వై | స | యె | కో | ట | చ | కు |
| ర్త | తు | త | ని | బ్నా | య | స | నే | నే | ను | వా | నా | మ | న | హో |
| తు | బ్లా | ది | నీ | వు | షా | మూ | తె | బూ | లి | సి | మో | న్ను | కొ | యా |
| ధ | అం | యు | యో | ఉ | ఫా | ధా | అ | జీ | ట్లు | యె | హ | న | ర్మీ | ను |
| కా | హి | జ్కే | వా | గ్ర | ను | న | తి | ర | ఆ | హో | స్థ | యి | ల | ము |
| బ | ల్కీ | హె | షు | త | చ | క | క్ర | ఉం | మో | నా | బు | లో | ల | ను |
| కు | యా | యె | డి | షు | న | ర్త | మ | ని | జు | దా | ధు | కా | ల | దా |
| లె | ల | స్థ | యె | నే | స్య | ప్ర | ము | షె | హ | బు | ర | ను | రే | ర |
| ద్మె | ము | ష | ల | ప | నో | లో | ని | కె | మ | మ | ము | ది | మి | జ |
| బె | యా | కి | నీ | హ | ను | ము | రూ | న | ధ | యా | న | గై | రు | బూ |
| ఏ | యా | రీ | నే | త | చ్చె | బు | ద | ప్ర | వ | చ | న | ము | ను | నె |

**జవాబులు పంపినవారు :**

1. బి. మోనికఏంజెలినా–ఒంగోలు, 2. పి. విజయకుమారి –ఒంగోలు, 3. బి. నెహెమ్యా–చిన్నగంజాం, 4. బి.సరోజిని –గుంతకల్లు, 5. జయమ్మలాబాను–గుంతకల్లు, 6. వై.సంధ్యారాణి–ఒంగోలు, 7. రంజిత్‌సింగ్‌రామానుజులు –ఒంగోలు, 8. యేసురత్నం–ఒంగోలు, 9. సి.హెచ్. దయరాజు–రామానుజపురం, 10. యన్. సాత్విక్ బాబు –మంగళగిరి, 11. కె. ఉదయకుమారి–కాకుమాను, 12. యం. రాంబాబు– నిడదవోలు, 13. యం. స్వయంప్రభ– చిలకలూరిపేట, 14. సి.హెచ్. జయకర్– శ్రీకాళహస్తి, 15. వి. వినోద్‌కుమార్–మండపం, 16. టి. క్రిస్టియానమ్మ– నందికొట్కూరు. 17. కె. బెంజిమెన్–విజయవాడ. 13. కె. మార్టిన్‌మధుచరణ్–పులివెందుల.

# బైబిల్ పద వినోదం - 19

## దానియేలు

ఈ క్రింది పదాలను ప్రక్కనున్న అక్షరాలలో వెదకండి. పదాలు అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఉండవచ్చు, కానీ పదాలు ఒకదాని మీదగా ఇంకొకటి గుర్తించ కూడదు. గుర్తించిన క్రింది పదమును (✓) టిక్ పెట్టండి. మిగిలిన అక్షరాలను ఎడమ నుండి కుడికి, కుడి నుండి ఎడమకు సమకూర్చి వచ్చిన వాక్యమును క్రింద బాక్స్‌లో వ్రాయండి.

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| బె | ఆ | అ | దా | క | య | రు | నా | షీ | న | మ | ర్మ | ము | లు | ఊ |
| ల్తె | స | గ్ని | ని | ల్దీ | దే | ను | అ | ల | ము | ల | ము | గ | కా | ల |
| షా | మ | జ్వా | యే | యు | వ | శా | య | జ | ము | షు | ల | బ్రి | ల | యి |
| జ | అ | ల | లు | లు | దూ | స | ను | ల | ర్యా | వే | కు | యే | అ | క |
| రు | ష్పె | ఆ | బ | మా | త | న | ర్చు | యూ | వా | ర్యా | వ్యా | లు | బే | ద్రై |
| జు | న | రా | జ్ఞ | బు | లు | ము | జ్ఞా | డి | దు | ద | నో | యుం | ద్నె | వి |
| ల | జు | ను | త్రో | రా | లో | సి | న | వే | యు | లు | మ | చు | గో | జ్ఞా |
| గ | ఉ | రు | హి | చు | జ్య | ను | వి | బొ | చు | మిం | య | ప్రా | ని | ప |
| ర్వ | ద | జ | ద్దె | న్న | వా | ము | వే | క్క | మి | షా | యే | లు | ర్థ | న |
| ము | ర్శ | ద్నె | కె | కు | వే | వి | క | స | కు | ర్యో | అ | ను | డు | న |
| ల | న | క | లు | ము | కు | వి | ము | ము | రు | లు | యే | ఖా | మి | వే |
| కు | ము | బు | ల | న | న్యా | ను | లు | జ్ఞా | స్స | ష | ను | ప్ర | ము | క |
| మే | జ్ఞా | నె | ఘ | జ్ఞా | న | జ్ఞా | న | ము | ల్ష | ద్ర | ను | అ | తి | ను |
| నై | షా | డు | న | త్వ | హ | ను | వా | చు | బె | కు | హిం | గ్ర | రా | మ |
| చె | ర | కు | త | త | యు | లు | న్నా | సిం | హో | ల | గు | హ | డు | దూ |

పేరు.......................... గ్రామము..........................

అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు..........................

**'బైబిలు పద వినోదము-19'** పూర్తి చేసిన తర్వాత పేరు, ఊరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు వ్రాసి ఈ పేజీని ఫోటో తీసి 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా పంపగలరు లేదా ఈ పేజీని జెరాక్స్ తీసి **15వ తేదీలోగా** మా అడ్రసుకు పంపగలరు. సీరియల్ నంబరు వేయకపోతే వారి పేరు ప్రచురింపబడదు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| బబులోను | దానియేలు | మిషాయేలు | మర్మములు | అబేద్నెగో | బెల్షస్సరు |
| దర్యావేషు | దర్శనము | గబ్రియేలు | హిద్దెకెలు | మిఖాయేలు | కల్దీయులు |
| శాసనము | అష్పెనజు | బొక్కసము | విజ్ఞాపన | అగ్నిజ్వాల | జ్ఞానులు |
| రాజ్యము | గర్వము | యూదులు | హనన్యా | అజర్యా | షద్రకు |
| మేషాకు | అర్యోకు | ప్రతిమ | ఘనత | షీనారు | ఊలయి |
| ప్రార్థన | బెల్తెషాజరు | సింహాలగుహ | తత్వజ్ఞానము | దేవదూతలు | మనోవ్యాకులము |
| నెబుకద్నెజరు | జ్ఞానవివేకములు | దూరా | కల | చెర | ఆజ్ఞ |

**పై పదాలను గుర్తించిన తర్వాత మిగిలిన అక్షరాలను సమకూర్చి, వచ్చిన వాక్యమును ఇక్కడ వ్రాయండి.**

_ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _

(దాని. 2:21)

_ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _